
సాగర్ వద్ద పర్యాటకుల సెల్ఫీలు

దొంగకే తాళం

- అక్రమార్కుడికే జొన్నలగడ్డలో సహకారం
- తాజాగా ఎరువుల విక్రయ అధికారం ఆ వ్యక్తికే..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

దొంగకే తాళాలు అన్న చందంగా జొన్నలగడ్డ సొసైటీలో పరిస్థితి నెలకొంది. రుణాలకు సంబంధించి రైతులు చెల్లించిన సొమ్ములు, గతంలో ఎరువులు విక్రయించిన నగదు బ్యాంకుకు జమ చేయని వ్యక్తికే మళ్లీ ఎరువుల విక్రయ అధికారాన్ని కట్టబెట్టడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీసీసీబీ, వ్యవసాయశాఖల అధికారులు వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది. సుమారు రూ.కోటి కాజేసిన సొసైటీ కార్యదర్శి నంద్యాల వీరారెడ్డిని సస్పెండ్ చేసి జీడీసీసీబీ చేతులు దులుపుకుంది. సదరు సొసైటీ ద్వారా విక్రయించిన ఎరువుల సొమ్ము రూ.2 లక్షలను ఇంతవరకు మార్క్‌ఫెడ్‌కు చెల్లించకపోయినా ఇంతవరకు చర్యలు లేవు. సుమారు రూ.15 లక్షలు చెల్లించగా మార్క్‌ఫెడ్ ఎరువులను సొసైటీకి సరఫరా చేసింది. అయితే ఈ ఎరువుల విక్రయాలకు సంబంధించి


జొన్నలగడ్డ సొసైటీ కార్యాలయం

వ్యవ సాయ శాఖ జారీ చేసిన ఈ-పోస్ యంత్రంలో ఇంకా వీరారెడ్డి వేలి ముద్రే ఉంది. సస్పెండ్ అయిన వీరారెడ్డి వేలి ముద్రను తొలగించి వేరొకరికి అనుమతిస్తేనే రైతులకు ఎరువులు విక్రయించే పరిస్థితి ఉంటుంది. లేకుంటే వీరారెడ్డి ద్వారానే ఎరువులు విక్రయించాలి. అయితే ఇప్పటి వరకు ఈ విషయం గురించి అటు వ్యవసాయ, ఇటు సహకారశాఖల అధికారులు పట్టించుకోలేదు. అంటే పరోక్షంగా వీరారెడ్డి ద్వారానే ఎరువుల విక్రయించేందుకు అధికారులు సిద్ధమవు తున్నారన్న అను మానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కుడిపై చర్యలు తీసుకోకపోగా అతడి ద్వారానే ఎరువులు విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సదరు అధికారులపై రైతులు మండిపడుతున్నారు.

భూసేకరణ జటిలం

- భూముల పరిహారంపై రోజుకో రేటు
- ఆగిన 167ఏ జాతీయ రహదారి పనులు
- బైపాస్ బాధితులతో సమావేశాలు.. కొలిక్కిరాని సమస్య

పల్నాడు- బాపట్ల జిల్లాలను కలిపే వాడరేవు - నకరికల్లు 167ఏ జాతీయ రహదారి భూసేకరణ సమస్య రోజు రోజుకు జటిలంగా మారుతుంది. భూమి పరిహారం విషయంలో అటు రైతులు.. ఇటు అధికారుల మధ్య ఏళ్లుగా వివాదం కొన సాగుతోంది. పల్నాడు జిల్లా పరిధిలో 38 కిలో మీటర్ల మేర రహదారి నిర్మాణానికి ఈ నెల 2న కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ, సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకు స్థాపన చేసిన విషయం తెలిసిందే. రూ.787 కోట్లు నిధులు విడుదలయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తయింది. అయితే పల్నాడు జిల్లా పరిధిలో రహదారి నిర్మాణం భూసేకరణ దశలోనే ఆగిపోయింది.


చిలకలూరిపేట పరిధిలో పూర్తయిన జాతీయ రహదారి పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట బైపాస్ నిర్మాణంలో భూములకు చెల్లించే పరిహారం విషయంలో ఉన్నతాధికారులు రోజుకో ధర చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి పనులు బాపట్ల జిల్లా పరిధిలో వేగవంతంగా జరుగుతుండగా, పల్నాడు జిల్లా పరిధిలో నరసరావుపేట బైపాస్ వద్దకు వచ్చే సరికి నిలిచిపోయాయి. తాజాగా అధికారులు బాధిత రైతు ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కూడా సమస్యకు పరిష్కారం లభించలేదు. తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతులు కోర్టులో (మిగతా 7వ పేజీలో)

సాగర్‌లో పర్యాటకుల సందడి

- నాగార్జున కొండకు పోటెత్తిన పర్యాటకులు

విజయపురిసౌత్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సెలవు దినం.. ఆపై నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటి విడుదలతో.. సాగర్ ప్రాంతంలో పర్యాటకుల సందడి నెలకొంది. జలాశయం 26 గేట్ల నుంచి నీటి విడుదల చేస్తుండటంతో అటు తెలంగాణ, ఇటు ఏపీలోని వివిధ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నూతన వంతెన, పాత వంతెన, సాగర్ ప్రధాన డ్యాం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. సాగర్ నుంచి జాలువారుతున్న అందాలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో పర్యాటకులు ఆసక్తి చూపారు. అంతెత్తు నుంచి దిగువకు వస్తున్న వరద ప్రవాహం చూసి పర్యాటకులు తన్మయం చెందారు. చిన్నారులు, యువకులు కేరింతలు కొడుతూ సెల్ఫీలు దిగారు. ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను తిలకించేందుకు పర్యాటకులు ఉత్సాహం చూపారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు శాంతిసిరి, నాగసిరి, అగస్త్యా లాంచీలలో చేరుకున్నారు. కొండపై ఉన్న మ్యూజియంలోని బుద్ధుడి ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుడి పాలరాతి విగ్రహాలను సందర్శించారు. అనుపులోకి అశ్వమేధ యజ్ఞశాల, శ్రీచైత్యం, యాంపి థియేటర్, శ్రీరంగనాథస్వామి ఆలయం వీక్షించారు. అనంతరం 60 అడుగులు ఎత్తు నుంచి జాలువారుతున్న ఎత్తిపోతల జలపాత అందాలను తిలకించారు. లాంచీల ద్వారా రూ.1,74,700 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.


నాగార్జున కొండను సందర్శించి వస్తున్న పర్యాటకులు

- గణేశ్ ఉత్సవ కమిటీల నుంచి దోపిడీ
- పేరుకే ఆన్‌లైన్ సింగిల్ విండో విధానం
- ఫోన్లు చేసి పిలిపించుకుని శాఖలవారీగా వసూళ్లు
- ఆన్‌లైన్‌లో చేస్తే సరిపోదు.. కలవాల్సిందేనని హుకుం

అడిగినంత ఇస్తేనే.. అనుమతి




గణేశ్ విగ్రహ కమిటీల నుంచి తీసుకుంటున్న అఫిడవిట్

(తెనాలి - ఆంధ్రజ్యోతి)

పోలీస్: మీరు గణేశుని మండపం పెట్టుకునేందుకు అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు కదా! ఒకసారి స్టేషన్‌కు వచ్చి కలవండి.

కమిటీ: ఆన్‌లైన్‌లో చేస్తే సరిపోతుందన్నారు కదా! మళ్లీ కలవడం ఎందుకు.

పోలీస్: ఆన్‌లైన్‌లో చేస్తే సరిపోదు.అఫిడవిట్ మేమెళ్లి తెచ్చుకోవాలా? వెంటనే వచ్చి కలిస్తే సరి.. లేకుంటే మీ ఇష్టం.

ఫైర్: హలో.. మేము అగ్నిమాపక కేంద్రం నుంచి ఫోన్ చేస్తున్నాం. ఫైల్ అందింది. వచ్చి తీసుకువెళ్లండి.

కమిటీ: అనుమతి పత్రం ఇస్తారా! తీసుకెళతాం.

ఫైర్: రూ.500 ఇచ్చి తీసుకెళ్లండి.

కమిటీ: అదేంటండీ డీడీ కట్టాం కదా?

ఫైర్: అది కాదు. మాకు ఇవ్వాల్సిన మామూళ్లు ఎవరిస్తారు. పండుగలప్పుడే కదా! మాకూ ఒక రూపాయి వచ్చేది. అవి ఇస్తే మీ కాగితం మీకిస్తాం.

ఇదీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని పోలీసు, ఫైర్ అధికారుల తీరు. వినాయక చవితి సమీపిస్తున్న క్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. గతంలో మాదిరిగా పోలీసు, ఫైర్, విద్యుత్ శాఖల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో సింగిల్ విండో విధానంతో తమ కష్టాలు తీరాయని చవితి ఉత్సవ కమిటీలు ఆనందపడ్డాయి. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సరిపోదని తమను వచ్చి కలిసి అడిగినంత ఇస్తేనే అనుమతి అంటూ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఆదేశాలతో గణేష్ ఉత్సవ కమిటీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది మామూళ్ల పేరిట పట్టిపీడిస్తున్నారని కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులో ఇచ్చిన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి మరీ ఆయా అధికారులు పిలిపించుకుని దోచేస్తున్నారు. ఒక్కో మండపానికి అనుమతి తీసుకోవడానికి ప్రభుత్వానికి చెల్లించాల్సిన (మిగతా 7వ పేజీలో)

అఫిడవిట్ పేరుతో వసూళ్లు


గణేశుని మండపం ఏర్పాటుకు సాధారణంగా పోలీస్ శాఖకు సంబంధించి మైకు అనుమతి కోసం రోజుకు రూ.200 చొప్పున చలానా చెల్లిస్తే సరిపోతుంది. కానీ పోలీసులు అది చాలదంటూ కొత్తగా అఫిడవిట్ సమర్పించాలని షరతులతో వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఈ అఫిడవిట్ కూడా స్టేషన్ల పరిధిలో రెండు, మూడు చోట్ల మాత్రమే తయారు చేయించుకొచ్చేలా షరతులు పెట్టారు. అఫిడవిట్‌కు జ్యుడిషియల్ స్టాంప్, ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. కానీ వీటికి అదనంగా రూ.1500 నుంచి రూ.2500 వరకు చెల్లించాల్సి వస్తుందని, అంతఎందుకంటే పోలీసులకు ఇవ్వాలని చెప్పడం విశేషం. ఒకవేళ మరొకచోట నుంచి అఫిడవిట్ తీసుకువెళ్లితే దానిని తిప్పి పంపుతున్నారు. లేదంటే బహిరంగంగానే స్టేషనరీ, తెల్లకాగితాలు, పెన్నుల వంటివి తీసుకురావాలంటున్నారని ఉత్సవ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇంతా చెల్లించినా, నిమజ్జనం రోజున కానిస్టేబుల్‌ను పంపిస్తామని, ఎంతమంది వస్తే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున చెల్లించాలని ముందే చెప్పి పంపుతున్నారని కమిటీల సభ్యులు చెబుతున్నారు. ఫైర్ అధికారులకు రూ. 500 చెల్లిస్తేనే అనుమతి పత్రాన్ని ఇస్తున్నారని లేదంటే తిప్పుకుంటున్నారంటున్నారు. విద్యుత్ వినియోగానికి డీడీ కట్టినా లైన్‌మన్లు వసూళ్ల దందా చేస్తున్నారు. మొత్తంమీద ప్రభుత్వం సదుద్దేశంతో సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్ అనుమతికి అవకాశం కల్పిస్తే, అధికారులు దోపిడీ మాత్రం ఆగటం లేదు.

స్మార్ట్ కార్డులకు.. ముహూర్తం ఖరారు

ఎక్కడికక్కడ పంపిణీకి అధికారుల ఏర్పాట్లు

- రెండో దశలో గుంటూరు జిల్లాలో 30 నుంచి
- నాలుగో దశలో పల్నాడు, బాపట్లలో వచ్చే నెల 15..

సత్తెనపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం, కుటుంబ పెద్ద ఫొటో, కార్డు నెంబరు, షాపు ఐడీ నెంబరు, క్యూఆర్ కోడ్, కుటుంబసభ్యుల వివరాలతో ఏటీఎం తరహాలో రూపొందించిన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత తీసుకు రావడంలో భాగంగా స్మార్ట్ కార్డులను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను డీలర్ల వద్ద ఉన్న ఈ పోస్ యంత్రంతో స్కాన్ చేస్తే లబ్ధిదారుల వివరాలతో పాటు, సరుకుల వినియోగ సమాచారం కూడా తెలుసుకోవచ్చు. ఇలా సరికొత్త టెక్నాలజీతో రూపొందించిన స్మార్ట్ కార్డులను అందుకునేందుకు కార్డుదారులు కూడా ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో స్మార్ట్ కార్డుల పంపిణీని రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు దశల్లో చేపడుతుండగా గుంటూరు జిల్లాలో రెండో దశలో ఈ నెల 30న ప్రారంభించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చింది. దీంతో జిల్లాలో 5.85 లక్షల (మిగతా 7వ పేజీలో)



జిల్లా అధ్యక్ష రేసులో.. నలుగురు

- టీడీపీ పదవులపై త్రిసభ్య కమిటీ కసరత్తు
- నరసరావుపేటలో నేతల విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, నాయకులు మండలపు రవి, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, కన్నా, బ్రహ్మారెడ్డి, ప్రవీణ్, డాక్టర్ అరవిందబాబు, అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్ష పదవితో పాటు అనుబంధ సంఘాల ఎంపిక కోసం అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. నరసరావుపేటలో ఆదివారం పార్టీ అధిష్ఠానం నియమించిన త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో విస్తృత సమావేశం జరిగింది. ఈ క్రమంలో ఆయా పదవులకు సంబంధించి నేతలు, ప్రజాప్రతి నిధులు, ఎమ్మెల్యేల నుంచి త్రిసభ్య కమిటీ అభిప్రాయాలను స్వీకరించింది. ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పేరును ఎమ్మెల్యేలు ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తూ తమకు అవకాశం కల్పించాలని నల్లపాటి రామచంద్రప్రసాద్, నాగోతు శౌరయ్య కోరారు. కొల్లి బ్రహ్మయ్య పేరును పరిశీలించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సమావేశంలో ప్రతిపాదించారు. భాష్యం ప్రవీణ్‌కు పెదకూరపాడు టిక్కెట్ ఇచ్చిన సందర్భంలో ఎమ్మెల్సీ పదవి ఇస్తానని అధినేత చంద్రబాబు హామీ ఇచ్చి పార్టీ అధ్యక్ష పదవితో సరిపెట్టిన నేపథ్యంలో కొమ్మాలపాటినే తిరిగి కొనసాగించాలన్న డిమాండ్ నేతల నుంచి వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యేల మద్దతు కొమ్మాలపాటికి ఉండటంతో దాదాపు ఆయన ఎంపిక లాంఛనమే అన్న ప్రచారం జరుగుతోంది. జిల్లా అధ్యక్ష స్థానంతో పాటు అను బంధ కమిటీలకు సంబంధించి స్వీకరించిన అభి ప్రాయాలతో త్రిసభ్య కమిటీ పేర్లను అధిష్ఠానానికి ప్రతిపాదించనున్నది.

వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

సమావేశంలో త్రిసభ్య కమిటీ సభ్యులు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నాయకుడు మండలపు రవి తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వైసీపీ దుష్ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టాలని క్యాడర్‌కు పిలుపిచ్చారు. వైసీపీ అనే విష వృక్షం నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత టీడీపీపైనే ఉందన్నారు. సమావేశంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మారెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్, ప్రస్తుత పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.


క్రస్ట్‌గేట్ల మరమ్మతులు (పాత చిత్రం)

ఎదురు చూపులకే పరిమితం..

- బుగ్గవాగు రిజర్వాయర్ విస్తరణపై ఆశలు
- సామర్థ్యం పెంపుతో తీరనున్న నీటి కష్టాలు
- గుంటూరు, ప్రకాశం జిల్లాలకు కీలకమైన ప్రాజెక్ట్
- ఆధునికీకరణకు గురజాల, మాచర్ల ఎమ్మెల్యేల పట్టు

మాచర్లటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచే ప్రతిపాదన ఎదురుచూపులకే పరిమితమైంది. ప్రస్తుతం ఉన్న 1.5 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 7 టీఎంసీలకు పెంచితే.. కుడి కాలువ పరిధిలో ఆయకట్టుకు సాగు, గ్రామాలకు తాగు నీటికి ఢోకా లేకుండా ఉంటుంది. రాష్ట్ర విభజన తర్వాత నాగార్జున సాగర్ డ్యాం కేఆర్‌ఎంబీ పరిధిలో ఉంది. నీటి విడుదల బోర్డును అనుసరించే జరుగుతుంది. 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో బుగ్గవాగు విస్తరణ ప్రణాళిక రూపొందించినా.. తదుపరి ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ ప్రతిపాదనను నీరు గార్చింది. విస్తరణ కోసం డీపీఆర్ సిద్ధం చేయాలని నామమాత్రపు నిధులు కేటాయించి, కాలం వెళ్లదీసింది.

సామర్థ్యం పెంచుకుంటే..

కూటమి ప్రభుత్వం వచ్చాక బుగ్గవాగు డ్యాం ఆధునికీకరణపై రైతుల్లో ఆశలు చిగురించాయి. బుగ్గవాగులో ప్రస్తుతం 1.5 టీఎంసీలు డెడ్ స్టోరేజీ కాగా టీఎంసీ నీరు స్టోరేజీ ఉంది. బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో పూడిక తొలగించి నీటి సామర్థ్యాన్ని 7 టీఎంసీలకు పెంచుకోగలిగితే తాగు నీటి సమస్య తీరనుంది. కుడికాలువ పరిధిలో పత్తి, మిర్చి వాణిజ్య పంటలు పండిస్తున్న దృష్ట్యా నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది.

సామర్థ్యం పెంపుపై దృష్టి

బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు, ఆధునికీకరణ కోసం ఎమ్మెల్యేలు యరపతినేని, జూలకంటి పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖ మంత్రి రామానాయుడుని కలిసి నివేదించారు. వారి విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ముఖ్యమంత్రి నేరుగా జోక్యం చేసుకొని సంబంధిత అధికారుల నుంచి సమాచారం కూడా తెప్పించుకున్నట్లు తెలిసింది. దీంతో గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించే కీలకమైన ఈ బుగ్గవాగు ఆధునికీకరణ పనులు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


బుగ్గవాగు రిజర్వాయర్

3, 6 క్రస్ట్ గేట్లు పునరుద్ధరణ..

బుగ్గవాగు రిజర్వాయర్ క్రస్ట్ గేట్లకు మరమ్మతుల సమస్య ఐదేళ్లుగా పట్టి పీడిస్తోంది. 3, 6 నూతన క్రస్ట్ గేట్లను ఏర్పాటు చేయాలని.. గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. రూ. 60 లక్షల నిధులు మంజూరు చేయించి యుద్ధ ప్రాతిపదికన కొత్త గేట్లను ఏర్పాటు చేయించారు. మరో రెండు గేట్లు కూడా అవసాన దశకు చేరుకున్నాయి. 10 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన ఆరు మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. క్రస్ట్ గేట్లను జనరేటర్ సాయంతో ఆపరేట్ చేస్తున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు విద్యుత్ సౌకర్యాన్ని మెరుగుపరచాల్సి ఉంది. గతంలో కుడి కాలువ పరిధిలో 901 లస్కర్లు పనిచేస్తుండగా ప్రస్తుతం ఆ సంఖ్య 72 మందికి పరిమితమైంది.

దిక్సూచి

సీఏ ఎవర్ గ్రీన్ కోర్సు

ఒకప్పుడు ఆర్ట్స్, కామర్స్ గ్రూపుల విద్యార్థులంటే చిన్న చూపు ఉండేది. చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ) లాంటి ప్రొఫెషన్స్ పాపులర్ అయ్యాక పరిస్థితి మారింది. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న సీఏల సంఖ్య కేవలం నాలుగు లక్షలు. 2050 నాటికి మన దేశానికి 50 లక్షల మంది సీఏలు అవసరం అని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' ప్రెసిడెంట్ చరణ్ జోత్ సింగ్ నంద ఇటీవలే ఒక మీడియా సమావేశంలో తెలిపారు. అంటే రాబోయే రోజుల్లో ఈ కోర్సుకు డిమాండ్ ఎలా ఉంటుందో అర్థం అవుతోంది. పాతికేళ్లుగా మన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు విదేశాల్లో ఎలా విజయం సాధిస్తున్నారో, అదేమాదిరిగా భవిష్యత్తులో చార్టర్డ్ అకౌంటెంట్లు కూడా మారే అవకాశం ఉంది. ఇంజనీరింగ్, మెడిసిన్‌తో పోలిస్తే ఈ కోర్సుకయ్యే ఖర్చు తక్కువ. ఉద్యోగం గ్యారంటీ. మారుతున్న అవసరాలు, మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా ఈ కోర్సులో మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి.



ఇటీవలి మార్పులు...

- గతంలో సీఏ ఇంటర్, ఫైనల్‌లో 8 పేపర్లు ఉంటే ఇప్పుడు అవి 6కి తగ్గాయి. విద్యార్థులు తరచూ ఫెయిల్ అయ్యే పేపర్లు తీసేశారు. ఒక ఎలక్టివ్ పేపర్‌ను జత చేశారు.
- ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ పరీక్షలు గతంలో సంవత్సరానికి రెండు సార్లు జరిపితే ఇప్పుడు ఏటా మూడు సార్లు నిర్వహిస్తున్నారు.
- అలాగే సీఏ ఫైనల్ చేస్తూ మూడు సంవత్సరాల పాటు ఆర్టికల్‌షిప్(ప్రాక్టికల్ ట్రైనింగ్) చేయాల్సి వచ్చేది. కొత్త విధానంలో ఇది రెండు సంవత్సరాలు మాత్రమే.

కమ్యూనికేషన్ స్కిల్స్‌కి పెద్దపీట

సీఏ కోర్సులోని మొదటి దశ సీఏ-సీపీటీ స్థానంలో ఇప్పుడు సీఏ ఫౌండేషన్ చేరింది. పాత సీపీటీలో పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో, నెగెటివ్ మార్కింగ్‌లతో ఉండేది. కొత్త విధానంలో 50 శాతం ప్రశ్నలు వ్యాసరూపంలో, 50 శాతం ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఇవ్వనున్నారు. అంటే మొత్తం 4 పేపర్లలో 2 పేపర్లు డిస్క్రిప్టివ్ పేపర్లు. దీంతో నెగెటివ్ మార్కులకు అవకాశం లేదు.

- అలాగే సీపీటీ విధానం ఉన్నప్పుడు అందులోని నాలుగు పేపర్లకు ఒకేరోజు పరీక్ష నిర్వహించేవారు. కానీ కొత్త విధానంలో ఫౌండేషన్‌లోని 4 పేపర్లను నాలుగు రోజులు(ఒక్కోరోజు ఒక్కోపేపర్) పరీక్ష నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్ష రాసే అవకాశం ఏర్పడింది. అలాగే 'ఆర్టికల్‌షిప్'(ప్రాక్టికల్ ట్రైనింగ్)లో కూడా కొన్ని మార్పులు చేశారు. ఒకప్పుడు ఐపీసీసీలో(ఇప్పటి సీఏ ఇంటర్మీడియట్) రెండు గ్రూపులు(లేదా) కనీసం మొదటి గ్రూపు పాస్ అయిన వారికే ఆర్టికల్‌షిప్‌కి అవకాశం ఉండేది. ఇప్పుడు సీఏ ఇంటర్‌లో రెండు గ్రూపులు పూర్తి చేసిన వారికి మాత్రమే ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో చేరే అవకాశం కల్పించారు.

రెండో దశ ఇంటర్

సీఏ ఫౌండేషన్ పూర్తి చేసినవారు ఇంటర్ చదవడానికి అర్హులు. గ్రాడ్యుయేట్లు/ సీఎంఏ ఇంటర్/ సీఎస్ ఇంటర్ పూర్తి చేసిన వారు ఫౌండేషన్‌తో సంబంధం లేకుండా నేరుగా సీఏ ఇంటర్ పరీక్ష రాయవచ్చు. సీఏ ఇంటర్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 18,000/-. ఈ పరీక్షని మే నెలలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం సెప్టెంబరు 1లోగా, సెప్టెంబరులో రాయాలనుకుంటే అదే సంవత్సరం జనవరి 1లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. జనవరిలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం మే 1లోగా నమోదు చేయించుకోవాలి.

డిగ్రీ అర్హతతో: డిగ్రీ అభ్యర్థులు ఫౌండేషన్‌తో సంబంధం లేకుండా నేరుగా సీఏ ఇంటర్‌కు నమోదు చేయించుకోవచ్చు. కామర్స్ యూజీ/పీజీ అయితే 55శాతం మార్కులు, ఇతర డిగ్రీ/ పీజీ అయితే 60శాతం మార్కులు ఉండాలి. అయితే వీరు సీఏ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే నాలుగు వారాల ఐసీఐటీఎస్ఎస్(ఇంటిగ్రేటెడ్ కోర్సు ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ స్కిల్స్) శిక్షణ తరగతులకు హాజరు కావాలి. దీని తరవాత ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రారంభించాలి. 8 నెలల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తిచేసిన వారే సీఏ ఇంటర్ పరీక్షకు అర్హులు.

- ఇంటర్‌లోని 6 పేపర్లను 2 గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో 3 పేపర్లు ఉంటాయి. ఒక్కోక్క పేపరు 100 మార్కులకు ఉంటుంది. ఇంటర్ పాస్ కావాలంటే ప్రతి పేపరులో 40 శాతం మార్కులు, గ్రూపు మొత్తం మీద 50 శాతం మార్కులు రావాలి. సీఏ ఇంటర్ రెండు గ్రూపులూ పూర్తి చేసిన వారు రెండు ఏళ్ల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తి చేయాలి.

ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఆర్టికల్‌షిప్): సీఏ ప్రాక్టికల్ ట్రైనింగ్‌ను గతంలో ఆర్టికల్‌షిప్ అని పిలిచేవారు. గతంలో ఈ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఆర్టికల్‌షిప్) మూడు సంవత్సరాలు ఉండేది. ఇప్పుడు దానిని రెండు సంవత్సరాలకు తగ్గించారు.

- సీఏ ఇంటర్ రెండు గ్రూపులూ పూర్తి చేసిన వారు ఇన్‌స్టిట్యూట్ వారి 4 వారాల ఏఐసీఐటీఎస్ఎస్(అడ్వాన్స్‌డ్ ఇంటిగ్రేటెడ్ కోర్సు ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ స్కిల్స్) శిక్షణ కూడా తీసుకోవాలి. వీరికి ఉపకారవేతనం లభించే అవకాశం ఉంది.

మొదటి దశ ఫౌండేషన్

సీఏ ఫౌండేషన్ పరీక్ష సంవత్సరానికి మూడుసార్లు (జనవరి, మే, సెప్టెంబర్) నిర్వహిస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 9,000/-. ఈ ఫౌండేషన్ పరీక్ష మే నెలలో రాయాలనుకుంటే అదే సంవత్సరం జనవరి 1లోగా, సెప్టెంబరులో రాయాలనుకుంటే అదే సంవత్సరం మే 1లోగా నమోదు చేయించుకోవాలి. ఇక జనవరిలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం సెప్టెంబరు 1లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇంటర్మీడియట్(లేదా), 10+2(లేదా) అందుకు సమానమైన పరీక్ష రాసిన వారు ఫౌండేషన్ కోర్సుకి నమోదు చేయించుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేసుకున్న నాలుగు నెలలకు ఫౌండేషన్ పరీక్ష రాయవచ్చు.

- ఇప్పటి సీఏ ఫౌండేషన్ స్థానంలో గతంలో నిర్వహించిన సీపీటీ పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల రూపంలోనే ఉండేది. కానీ, ప్రస్తుత ఫౌండేషన్ పరీక్షలో 50 శాతం మార్కులను డిస్క్రిప్టివ్ పరీక్షగా, మరో 50 శాతం మార్కులను మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుగా పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇక ఫౌండేషన్‌లో ఉత్తీర్ణత సాధించాలన్న విద్యార్థి ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం మార్కులు సాధించాలి అలాగే 4 పేపర్లు కలిపి 400 మార్కులకు గాను 50 శాతం మార్కులు అంటే 200 మార్కులు సాధించాలి.

మూడో దశ ఫైనల్

సీఏ ఇంటర్ తదుపరి రెండు సంవత్సరాల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తిచేసిన వారు సీఏ ఫైనల్‌కు నమోదు(రిజిస్ట్రేషన్) చేయించుకొవచ్చు. దీని రిజిస్ట్రేషన్ ఫీజు 22,000/-. ఫైనల్ నమోదుకి తుది గడువు అంటూ ఏమీలేదు. ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తికాబోతున్న సమయంలో ఫైనల్‌కి నమోదు కావచ్చు. అంటే ఫైనల్ పరీక్షకు దరఖాస్తు చేసేలోగా రిజిస్ట్రేషన్ పూర్తి కావాలి. ఫైనల్ పరీక్షను కూడా సంవత్సరానికి మూడు సార్లు అంటే జనవరి, మే, సెప్టెంబరు నెలల్లో నిర్వహిస్తారు.

- ఈ పరీక్ష మొత్తం 6 పేపర్లు. 2 గ్రూపులుగా(గ్రూపుకి 3 పేపర్ల చొప్పున) ఒక్కోక్క పేపర్ 100 మార్కులకు మొత్తం 600 మార్కులకి ఉంటుంది. విద్యార్థి వీలును బట్టి 6 పేపర్లు ఒకేసారి లేదా ఒక్కో గ్రూపు విడివిడిగా రాసుకోవచ్చు.
- ఇందులో పాస్ కావాలంటే ప్రతి పేపరులో 40 శాతం మార్కులు, గ్రూపు మొత్తం మీద 50 శాతం మార్కులు రావాలి.

రిజిస్ట్రేషన్ కోసం: www.icai.org/post/studentsservices లేదా 98851250001, 98851250003 హెల్ప్ లైన్ నెంబర్లని సంప్రదించవచ్చు.



ప్రకాశ్
డైరెక్టర్, మాస్టర్ మైండ్స్

జామ్ 2026



'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్'(జామ్-2026) నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 22 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ(టెక్నాలజీ), ఎంఎస్ రిసెర్చ్, ఎంఎస్సీ ఎంటెక్, జాయింట్ పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ(డ్యూయల్ డిగ్రీ) కోర్సుల్లో అడ్మిషన్లు జరుపుతారు. ఈసారి ఎంట్రెన్స్‌ను ఐఐటీ బాంబే నిర్వహించనుంది. 2025 సెప్టెంబరు 5 నుంచి దరఖాస్తులు దాఖలు చేయవచ్చు. ఎంట్రెన్స్ 2026 ఫిబ్రవరి 15న జరుగుతుంది. ఫలితాలు మార్చి 18న వెలువడుతాయి.

అర్హత: నిర్దేశిత విభాగాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా అర్హులే.

సబ్జెక్టులు: బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మేథ్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ.

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి

దరఖాస్తులకు తుది గడువు: 2025 అక్టోబర్ 12 **వెబ్‌సైట్:** https://jam2026.iitb.ac.in

కేసీ మహీంద్రా స్కాలర్‌షిప్

'మహీంద్రా ఆల్ ఇండియా టాలెంట్ స్కాలర్‌షిప్-2025' కోసం కె.సి. మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో డిప్లొమా కోర్సులు అభ్యసించేందుకు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు సహాయం చేయడానికి స్కాలర్‌షిప్‌లను అందించనున్నారు.



- ఏటా రూ. 10,000 చొప్పున 550 మంది విద్యార్థులకు గరిష్ఠంగా 3 సంవత్సరాలపాటు ఈ స్కాలర్‌షిప్ అందజేస్తారు.
- 10/12వ తరగతి లేదా తత్సమాన పరీక్షలలో 60 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించి ఉండాలి. అలాగే డిప్లొమా కోర్సు కోసం ప్రభుత్వ/ గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశం పొంది ఉండాలి. కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హులు.
- **చివరి తేదీ:** 2025 ఆగస్ట్ 27.
- **వెబ్‌సైట్ :** www. kcmet.org

జాబ్ కార్నర్

హెడ్ కానిస్టేబుల్(రేడియో ఆపరేటర్), హెడ్ కానిస్టేబుల్(రేడియో మెకానిక్) గ్రూప్-సీ నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ నోటిఫికేషన్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతోంది.

బీఎస్ఎఫ్‌లో 1121 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

- హెడ్ కానిస్టేబుల్(రేడియో ఆపరేటర్) 910
- హెడ్ కానిస్టేబుల్(రేడియో మెకానిక్) 211

వయస్సు: 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 23

వెబ్‌సైట్: https//rectt.bsf.gov.in/

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులో లోకల్ ఆఫీసర్లు


పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో తెలంగాణలో 50, ఆంధ్రప్రదేశ్‌లో 80 ఖాళీలు ఉన్నాయి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉండాలి. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. **చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 4

వెబ్‌సైట్: punjabandsindbank.co.in/

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మదరాసి యాక్షన్



అమరన్ చిత్రం ఘన విజయం తర్వాత శివ కార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మదరాసి'. ఏ.ఆర్ మురగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. తాజాగా చిత్రబృందం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది. 'నీలాగే ఇతరులను ప్రేమించు... అందరినీ నీ కుటుంబమే అనుకో' అంటూ హీరోయిన్ రుక్మిణి వసంత్ పలికిన డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆకట్టుకునేలా ఉంది. డైలాగ్ పూర్తయిన వెంటనే పవర్‌ఫుల్ లుక్, పవర్‌ప్యాక్డ్ యాక్షన్‌తో కథానాయకుడిని పరిచయం చేశారు. ఆయుధ అక్రమ రవాణా నేపథ్యంలో మురగదాస్ కథను తీర్చిదిద్దారని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ చిత్రంలో విద్యుత్ జమ్వాల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. సెప్టెంబర్ 5న 'మదరాసి' ప్రేక్షకుల ముందుకు రానుంది.

రెండో పాటతో రెడీ



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. సెప్టెంబర్ 25న విడుదలవుతోంది. చిత్రబృందం ఆదివారం మరో అప్డేట్‌ను పంచుకుంది. వినాయక చవితి సందర్భంగా ఈ నెల 27న 'ఓజీ' నుంచి 'సువ్వీ సువ్వీ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేయనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రియాంక మోహన్‌తో కలసి పవన్ కల్యాణ్ కోనేటిలో దీపాలు వదులుతున్న లుక్‌ను పంచుకున్నారు.

రానా ఆవిష్కరించిన గీతం



అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి ముఖ్య తారాగణంగా మున్నా ధులిపూడి తెరకెక్కిస్తోన్న వినోదాత్మక చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్‌లైన్. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఇలా చూసుకుంటానే..' అంటూ సాగే గీతాన్ని హీరో రానా దగ్గుబాటి తన సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా ఆవిష్కరించారు. చంద్రబోస్ సాహిత్యానికి అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. 'ఈ పాటను జమ్మూ కశ్మీర్, మలేసియాలోని ప్రకృతి అందాలలో చిత్రీకరించామని, పూర్తిగా ఇది వినోద భరిత చిత్రం' అని యూనిట్ పేర్కొంది.

విశాల్ 'మకుటం'



హీరో విశాల్ 35వ ప్రాజెక్టుకు సంబంధించిన అప్డేట్ వచ్చింది. ఈ చిత్రానికి 'మకుటం' అనే పేరును మేకర్స్ ఖరారు చేసి టైటిల్ టీజర్‌ని రిలీజ్ చేశారు. రవి అరసు దర్శకత్వంలో సూపర్ గుడ్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆర్‌బీ చౌదరి నిర్మిస్తున్నారు. విశాల్ సరసన అంజలి కథానాయికగా నటిస్తున్నారు. టీజర్‌ను గమనిస్తే..ఇది సముద్రం నేపథ్యంలో నడిచే ఓ మాఫియా కథ అని అర్థమవుతోంది. జీవీ ప్రకాశ్ కుమార్ ఆర్ఆర్ అదిరిపోయింది. ఈ మూవీకి ఎన్.బి.శ్రీకాంత్ ఎడిటర్‌గా, దురైరాజ్ కళా దర్శకుడిగా, ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ రిచర్డ్ ఎం.నాథన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, ఇతర వివరాల్ని త్వరలో వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.

దుబాయ్‌లో 'గామా' వేడుక



'గామా'(గల్ఫ్ అకాడెమీ మూవీ అవార్డ్స్) అవార్డులకు టాలీవుడ్‌లో ఓ ప్రత్యేకత ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇప్పుడు ఐదో ఎడిషన్ వేడుకలను ఈనెల 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్, హీరోయిన్లు ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'గామా' సీఈవో సౌరభ్ కేసరి మాట్లాడుతూ 'ఇది కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న ఈవెంట్ కాదు. కళాకారులపై మా నాన్న త్రిమూర్తులుకు ఉన్న అభిమానంతో అవార్డులు ఇస్తున్నాం. వచ్చే ఏడాది మరింత ఘనంగా నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం. అలాగే ఇతర దేశాల్లోనూ గామా అవార్డులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రపంచంలోని తెలుగు వారందర్నీ అబ్బురపరిచేలా ఈవెంట్‌ను నిర్వహించబోతున్నాం' అని చెప్పారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బాలకృష్ణ



- భారతీయ సినీరంగంలో హీరోగా 50 సంవత్సరాల కెరీర్
- అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు, లోకేశ్

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే గోల్డ్ ఎడిషన్‌లో ప్రముఖ సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేరు నమోదైంది. భారతీయ సినిమాలో 50 సంవత్సరాల పాటు హీరోగా సుదీర్ఘ కెరీర్‌ను సాధించినందుకు ఆయన పేరును నమోదు చేశారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈవో సంతోష్ శుక్లా ఓ ప్రకటనలో.. బాలకృష్ణ ఐదు దశాబ్దాల సినిమా సేవలు లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని ప్రశంసించారు. ఈ నెల 30న వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు సంబంధించిన గుర్తింపు పత్రాన్ని హైదరాబాద్‌లో స్వయంగా బాలకృష్ణకు అందించనున్నట్లు శుక్లా తెలిపారు. లండన్ ప్రధాన కార్యాలయంగా ఉన్న వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంస్థ. బాలకృష్ణకు దక్కిన గుర్తింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. బాలకృష్ణ అసాధారణ సినీ ప్రస్థానానికి దక్కిన గుర్తింపుగా చంద్రబాబు కొనియాడారు. బాలయ్యకు అభినందనలు తెలిపారు. మంత్రి లోకేశ్ కూడా బాలకృష్ణకు అభినందనలు తెలిపారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

ఆ రోజే 'ఏం జరుగుతుందో..'

రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తోన్న సినిమా 'ది గర్ల్‌ఫ్రెండ్'. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్‌ని మేకర్స్ అనౌన్స్ చేశారు. 'ఏం జరుగుతోంది...' అంటూ సాగే గీతాన్ని ఈనెల 26న విడుదల చేయనున్నట్లు తెలిపారు. రాకేందు మౌళి సాహిత్యం అందించగా, చిన్మయి పాడారు. దీన్ని ఫీల్ గుడ్ లవ్ సాంగ్‌గా రూపొందించామని, సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.



సీనియర్ కార్టూనిస్టు దర్శకుడు శంకు కన్నుమూత



సీనియర్ వ్యంగ్య చిత్రకారుడు, రచయిత, దర్శక, నిర్మాత సంపర భీమ శంకర కుమార్ అలియాస్ శంకు(78) ఇకలేరు. ఆయన ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో గుండెపోటుతో బాగ్ అంబర్ పేటలోని స్వగృహంలో హఠాన్మరణం చెందారు. శంకు స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా తణుకు. బాపూ బొమ్మల స్ఫూర్తితో 1962లో తన 16వ ఏట కుంచె పట్టిన శంకు ఆంధ్ర పత్రికకు రెండు దశాబ్దాలు బొమ్మలు, కార్టూన్లు గీశారు. ఉన్నత విద్య అనంతరం ప్రఖ్యాత దర్శకుడు బాపు దగ్గర తొమ్మిది సినిమాలకు దర్శకత్వ శాఖలో పని చేశారు. ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో కొంతకాలం పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 'మిస్టర్ పెళ్లాం' సినిమాకు నిర్మాతగా వ్యవహరించినా, ఉద్యోగ నిబంధనల కారణంగా టైటిల్స్ లో మాత్రం సహ నిర్మాతగా వేయించినట్లు తానే ఓ సందర్భంలో చెప్పారు. మునిమాణిక్యం 'కాంతం కథలు', శంకరమంచి 'అమరావతి కథలు', వంశీ 'మా పసలపూడి కథలు', సయ్యద్ సలీం కథలను టెలివిజన్ ధారావాహికలుగా రూపొందించారు. అందుకుగాను నాలుగు నంది పురస్కారాలు అందుకున్నారు. తెలుగు కార్టూనిస్టులందరినీ ఒక వేదిక మీదకు తీసుకురావడంలో శంకు ప్రముఖ పాత్ర పోషించారు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన 13 మంది కార్టూనిస్టుల జీవితంపై 'ఎమినెంట్ కార్టూనిస్ట్స్ ఆఫ్ ఇండియా' పేరుతో దూరదర్శన్‌కు డాక్యుమెంటరీ చిత్రాలు తీశారు. క్రోక్విల్ హాస్య ప్రియ పేరుతో ఓ మాస పత్రికను కూడా నిర్వహించారు. క్రోక్విల్ అకాడమీ ద్వారా వ్యంగ్య చిత్రకారులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణం ఇతివృత్తంగా శంకు గీసిన కార్టూన్‌కు బెల్జియంలోని నాకీస్ట్ అంతర్జాతీయ పురస్కారం లభించింది. సాహిత్య, కళా రంగాలలో శంకు అందించిన సేవలకుగాను 2015లో తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారంతో సత్కరించింది. శంకు భార్య పేరు ఎల్లాప్రగడ శోభారాణి. ఆమె దూరదర్శన్ లో న్యూస్ రీడర్ గా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలందించారు. వీరికి ఇద్దరు పిల్లలు, కుమార్తె సత్య, కుమారుడు చైతన్య. శంకు భౌతికకాయానికి సినీ ప్రముఖులు వంశీ, బ్రహ్మానందం, రచయితలు బ్నిం, సుధామ, కార్టూనిస్టు సరసి తదితరులు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆదివారం సాయంత్రం అంబర్ పేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తయ్యాయి.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

ప్రాణాలు హరించే..
కలుపు మందు స్వాధీనం

● పార్సిల్ కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు



కలుపు మందును పరిశీలిస్తున్న డీఏఓ నాగేశ్వరరావు, ఏడీఏ

గుంటూరు సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అమ్మోనియం సాల్ట్ ఆఫ్ గ్లైపో సెట్. ఇదొక కలుపు మందు. నిలువునా మనిషి ప్రాణాలు తీసేస్తుంది. వాతావరణం కలుషిత పరచి క్యాన్సర్ కారకంగా మారుతుంది. దీని తీవ్రత దృష్ట్యా ఈ మందును రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఆదివారం అధికా రులు మెరుపు దాడులు చేసి ఈ కలుపు మందు విక్రయాల గుట్టు రట్టు చేశారు. నగరంలోని పార్సిల్ కార్యాలయాల్లో వ్యవసాయ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించగా.. క్రాంతి ట్రాన్స్ పోర్ట్‌లో ఈ నిషేధిత కలుపు మందు పెద్ద మొత్తంలో దొరికింది. తిరుపతి జిల్లా నాయుడుపేటలోని శ్రీనివాస సీడ్స్ నుంచి గుంటూరుకు చెందిన శబరి క్రాప్ కేర్ సైన్స్ పేరుతో దిగుమతి చేసుకున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన మందు అని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. నిల్వలను సీజ్ చేసిచ కేసులు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏ డీఏ ఎన్.మోహన్ రావు, పురుగు మందుల ఇన్‌స్పెక్టర్ సుజాత పాల్గొన్నారు.

ఆమెకు మతిస్థిమితం సరిగా లేదు

● తండ్రి వద్దకు చిన్నారిని చేర్చిన పోలీసులు



అనేక్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై సతీష్

తాడేపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గత శనివారం కూతురుని పుష్కర ఘాట్ మీద కూర్చో బెట్టి కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసు కున్న మహిళ కేసులో పోలీసులు కీలక వివరాలు సేకరించారు. తాడేపల్లి ఎస్సై సతీష్ వివరాల మేరకు.. ఎన్టీఆర్ జిల్లా కానూరుకు చెందిన రేటురి విజయ భారతి(31)కి మతిస్థిమితం సరిగా లేదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే తన కూతురు అనేక్య ఏంజిల్‌ను తీసుకొని సీతానగరం వద్దకు వచ్చి కృష్ణా నదిలో దూకిందని పేర్కొన్నారు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పాపను తండ్రి నరేష్, తాత ఇమ్మానియేల్‌కి అప్పగించినట్లు తెలిపారు.



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

పేలిన ట్రాన్స్‌ఫార్మర్.. 6 కార్లు దగ్ధం

పెదకాకాని, ఆగస్ట్ 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆటో నగర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం పేలింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి పక్కనే ఉన్న ఆరు కార్లు దగ్ధమయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు కొన్ని వాహనాలను అక్కడి నుంచి బయటకు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఎంబీబీఎస్ అడ్మిషన్స్‌లో.. బీసీడీ అభ్యర్థులకు అత్యధిక సీట్లు

గుంటూరు మెడికల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎంబీబీఎస్ అడ్మిషన్స్‌లో ఏయూ రీజియన్‌లో మొట్ట మొదటిసారిగా బీసీడీ అభ్యర్థులు ఓసీ అభ్యర్థుల కంటే ఎక్కువ సీట్లు సాధించారు. బీసీడీ అభ్యర్థులు మొత్తం 453 సీట్లు సాధించగా ఓసీ అభ్యర్థులు 447 సీట్లు సాధించారు. బీసీడీ అభ్యర్థులు తమకున్న ఏడు శాతం రిజర్వేషన్లకు అదనంగా ఓపెన్ కాంపిటీషన్లో రెండు రెట్ల కన్నా ఎక్కువ సీట్లు సాధించడం వల్ల ఇది సాధ్యమైంది. రిజర్వేషన్లు పొందే విద్యార్థులు కష్టపడి చదవరు అనే దురాభిప్రాయాన్ని చెరిపివేస్తూ.. బీసీడీ విద్యార్థులు ఆదర్శప్రాయంగా నిలిచినట్లు మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అభినందించారు. ఎంబీబీఎస్ అడ్మిషన్స్‌లో జీవో నంబరు 550ని సక్రమంగా అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



సభలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ఆంజనేయులు

వినుకొండ, ఆగస్టు 24, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్య సేవలు చాలా కీలకమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. నరసరావుపేట రోడ్డులో ఉన్న గంగినేని కల్యాణ మండపంలో ఆదివారం గ్రామీణ వైద్యుల ఐక్య వేదిక సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జీవీ ఆంజనేయులు పాల్గొని, మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పరంగా గ్రామీణ వైద్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

సాగర్ జలాశయానికి కొనసాగుతున్న వరద

● 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం శ్రీశైలం నుంచి 4,16,324 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 585.00 అడుగులు ఉంది. ఇది 297.43 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 9,019 , ఎడమ కాలువ ద్వారా 7,518, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,373, 26 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,63,714, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 4,16,324 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

టెయిల్‌పాండ్ ప్రాజెక్టుకు వరద ఉధృతి

రెంటచింతల,ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు స్పిల్ వే నుంచి 4,01,905 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. 13 రేడియల్ క్రస్ట్ గేట్లను 4.5 మీటర్లు, 5 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తామన్నారు. సాగర్ నుంచి 3,96,478 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వస్తోందని తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 74.28 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.820 టీఎంసీలకు సమానమన్నారు. విద్యుదుత్పత్తి జరగడం లేదన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 34.15 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. 3,91,650 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, పది గేట్ల ద్వారా 3,14,088, మొత్తం 3,31,088 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద

తాడేపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్ట్, కీసర, మున్నేరు, వెలగలేరు తదితర ప్రధాన వాగుల నుంచి 3,83,916 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 3,65,725 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాల్వకు 10,187, పశ్చిమ డెల్టాకు 8,004 క్యూసెక్కులు వదులుతున్నారు.



నాగార్జున సాగర్ 6 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



ప్రకాశం బ్యారేజ దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

సర్టిఫికెట్ల పరిశీలనకు సన్నాహాలు

● క్యాడర్ల వారీగా డీఎస్సీ అర్హులకు సమాచారం

● ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1100 పోస్టులు.. 23 కమిటీలు

గుంటూరు(విద్య), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. క్యాడర్ల వారీగా అర్హుల జాబితా విడుదలైన నేపథ్యంలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజులపాటు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అయితే ఆదివారం సాయంత్రం వరకు షెడ్యూల్ జారీ కాలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పీజీటీ, టీజీటీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ తదితర పది విభాగాల్లో విభాగాల్లో 1100కి పైగా పోస్టులను భర్తీ చేయనున్నారు. క్యాడర్ల వారీగా మెరిట్ కం రోస్టర్ జారీ చేయడంతో పాటు అర్హులకు ఇప్పటికే సమాచారం పంపించారు. పరిశీలన కార్యక్రమం సోమవారం లేదా మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

ప్రత్యేక కమిటీలు

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు మండల స్థాయి నుంచి రీజనల్ స్థాయి వరకు దాదాపు ఉమ్మడి జిల్లాలో 23 కమిటీలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రతీ కమిటీలో ముగ్గురు అధికారులు ఉంటారు. ఒక్కో కమిటీకి 50 మంది అభ్యర్థులను కేటాయించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు. ఈ క్రమంలో ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, గుంటూరు డీఈవో రేణుక, డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు ఆదివా రం గుంటూరు ఏసీ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీ లన అవసరమైన ట్రయల్ రన్ నిర్వహించారు.



గుంటూరు ఏసీ కళాశాలలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

స్మార్ట్ కార్డులకు.. ముహూర్తం ఖరారు

(5వ పేజీ తరువాయి)

మందికి స్మార్ట్ కార్డులు అందించేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ కార్డుల పంపిణీని ప్రారంభిస్తారని సమాచారం. అయితే 30వ తేదీ వరకు మంత్రి షెడ్యూల్ బిజీగా ఉంది. ఈ నెల 31 నుంచి జిల్లాలో కార్డుల పంపిణీ ప్రారంభం అయ్యే అవకాశం కనిపిస్తోంది. నాలుగో దశలో పల్నాడు, బాపట్ల జిల్లాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చింది. పల్నాడులో 6,39,282 మందికి, బాపట్ల జిల్లాలో 4.58 లక్షల మందికి స్మార్ట్ కార్డులను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కొత్త కార్డుల పంపిణీపై సందిగ్ధం

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీలో సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో 5,99,558 రైస్ కార్డులు ఉండగా ప్రభుత్వం 5,85,000 స్మార్ట్ రైస్ కార్డులను అందజేసేందుకు సిద్ధం చేసింది. దీనిని బట్టి కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి రైస్ కార్డుల జారీ కష్టమనే తెలుస్తోంది. ఇదే పరిస్థితి పల్నాడు, బాపట్లలోనూ నెలకొన్నట్లు సమాచారం.

మూడు దశల్లో యాక్టివేట్..

మొదటి రెండు దశల్లో యాక్టివేట్ ప్రక్రియ అనంతరం స్మార్ట్ కార్డులను రేషన్ డీలర్, సచివాలయ సిబ్బంది కలిసి లబ్ధిదారుకు అందజేస్తారు. మూడో దశలో ఈ-పోస్ యంత్రంలో కార్డును యాక్టివేట్ చేసుకోవాలి. ఈ దశలో కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను ఈ పోస్ మిషన్ ద్వారా స్కాన్ చేసి కార్డు యజమానితో ప్రామాణీకరించాలి. అప్పుడే కార్డు యాక్టివేట్ అవుతుంది. ఇలా మూడు దశల్లో కార్డును యాక్టివేట్ చేసుకోవడం ద్వారా ఈ కార్డు అత్యంత భద్రమైనదని ప్రభుత్వం చెబుతోంది.

కౌలు రైతు ఆత్మహత్య

కొల్లూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రుణభారంతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని క్రాప గ్రామానికి చెందిన కౌలురైతు, టీడీపీ నాయకుడు కుర్రా శ్రీనివాసరావు (55) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐదేళ్ల నుంచి సొంత భూమితో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని ఆయన సాగు చేస్తున్నారు. వ్యవసాయంలో నష్టాలు రావడంతో మూడు ఎకరాలు అమ్మి బకాయిలు తీర్చాడు. మళ్లీ అప్పులు పెరిగిపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు షైనేని మురళీకృష్ణ. శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులర్పించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

భూసేకరణ... జటిలం

(5వ పేజీ తరువాయి)

పిటిషన్లు దాఖలు చేయగా అది విచారణ దశలో ఉంది. భూములకు చెల్లించే ధరపై లిఖిత పూర్వకంగా హామీ ఇస్తేనే కోర్టులో పిటిషన్లు ఉపసంహరించు కుంటామని రైతులు అధికారులకు తేల్చి చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కోర్టులో కేసు తేలే వరకు భూ సేకరణ దస్త్రం ముందుకు కదిలే పరిస్థితి లేదని తెలుస్తుంది.

రెవెన్యూ హామీ.. స్పందించని హైవే అథారిటీ

నష్టపరిహారం విషయం చెల్లించే విషయంలో రెవెన్యూ అధికారులు సూచించిన పరిహారానికి రైతులు అంగీకరించారు. అయితే ఆ ధరపై హైవే అథారిటీ అధికారులు సానుకూలంగా స్పందించడం లేదు. నరసరా వుపేట పట్టణ పరిధిలోని వ్యవసాయ భూమికి రిజిస్ట్రేషన్ విలువపై రెండు రెట్లు, జొన్నలగడ్డ, కేసానుపల్లి, రావిపాడు, గుంటగార్లపాడు గ్రామాల పరిధిలోని భూములకు రిజిస్ట్రేషన్ విలువపై రెండున్నర రేట్లు పరిహారం చెల్లిస్తామని రెవెన్యూ అధికారులు బాధితులకు తెలిపారు. ప్రధాన రహదారి వెంట ఉన్న ఇళ్ల స్థలాలకు గజానికి రూ.19,000, లోపలగా ఉన్న వాటికి రూ.16,000 చొప్పున చెల్లిస్తామ న్నారు. ఎకరా పొలానికి సుమారు రూ.1.75 కోట్లు చెల్లిస్తామన్నారు. ఈ ధరకు సంబంధించి లిఖిత పూర్వకంగా ఒప్పంద పత్రాలు ఇస్తే స్థలాలు ఇస్తామని బాధి తులు చెబుతున్నారు. అయితే లిఖిత పూర్వకంగా ఇవ్వలేమని, హైవే అథారిటీ అధికా రులకు ప్రతిపాదించామని కోర్టులో కేసులు ఉపసం హరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కోర్టులో కేసులు ఉపసంహరించుకున్న తర్వాత అధికారులు చెప్పినట్లు పరిహారం చెల్లించకపోతే తాము నష్టపోతామని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరు వర్గాల మధ్య ప్రతిష్టంభన నేపథ్యంలో వారి మధ్య సమన్వయం కోసం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కృషి చేస్తున్నారు. పలుమార్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి పరిహారంపై చర్చించారు.

అడిగినంత ఇస్తేనే.. అనుమతి

(5వ పేజీ తరువాయి)

మొత్తం కంటే పది రెట్లు అదనంగా మామూళ్ల రూపంలో చెల్లించుకోవాల్సి వస్తోందని సభ్యులు వాపోతున్నారు.

చెప్పేదొకటి... చేస్తున్నదొకటి

బుధవారం చవితి. దీంతో పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా గణేశుని విగ్రహాల ఏర్పాటుకు పందిళ్లు వెలుస్తున్నాయి. మండపాలకు సంబంధించి అనుమతి తప్పనిసరి అని ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు వీలుగా 'గణేశ్ ఉత్సవ్ 2025 ఆన్‌లైన్ పర్మిషన్' పేరుతో ఒక పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఇందులో దరఖాస్తుతో పాటు పోలీస్, ఫైర్ వంటివాటికి చెల్లించాల్సిన మొత్తాలను ఆన్‌లైన్‌లో చెల్లించేస్తే సరిపోతుంది. అయితే ఆన్‌లైన్ విధానంతో మామూళ్లురావని భావించిన పోలీసులు, ఫైర్, విద్యుత్ తదితర శాఖల అధికారులు సొంతంగా సరికొత్త షరతులు పెట్టారు. దీంతో ప్రభుత్వం చెప్పినట్లుగా సింగిల్ విండో విధానం జిల్లాలో ఎక్కడా అమలు కావడంలేదు.

30,31వ తేదీల్లో ర్యాంకింగ్ క్యారం టోర్నమెంట్

చిలకలూరిపేట, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్ క్లబ్ లో ఈ నెల 30, 31వ తేదీలలో ఆంధ్ర రాష్ట్ర రెండవ ర్యాంకింగ్ క్యారం టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లుఆంధ్ర రాష్ట్ర క్యారమ్ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుక్ జలీల్ ఆదివారం తెలిపారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా నాకౌట్ పద్ధతిలో పోటీలు జరిపి.. మొదటి 6 స్థానాలను ఎంపిక చేసి రాష్ట్ర జట్టును ప్రకటిస్తామని చెప్పారు. క్రీడాకారులకు ట్రోఫీలతో పాటు రూ.30 వేల నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

చందాల వసూలులో ఘర్షణ.. కత్తితో దాడి



చికిత్స పొందుతున్న వెంకట ప్రసాదు

నూజెండ్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవత పోలేరమ్మ ఉత్సవాల నిర్వహణకు చందా వసూలు చేసే విషయంలో ఘర్షణ చోటుచేసుకోవడంతో..ఒకరు కత్తి పోటుకు గురయ్యారు. ఈ ఘటన మండలంలోని పి.అన్నవరంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామ దేవత పోలేరమ్మ ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామ పెద్దలు ఇంటికి రూ.500 చొప్పున చందా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ విషయంలో గ్రామ పెద్దలు ఒగ్గు రామ యోగయ్య.. భీమనాదం వెంకట ప్రసాదు, వెంకటేశ్వర్లును చందా డబ్బులు అడగడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. వీరి మధ్య విభేదాలు ఉండటంతో ఘర్షణకు దారి తీసింది. రామయోగయ్య, మనుమడు కొమ్మ గోపీ నాగేశ్వరరావులకు దెబ్బలు తగిలాయి. దీంతో గోపీ నాగేశ్వరరావు కత్తితో భీమనాదం వెంకట ప్రసాదుపై దాడి చేయడంతో తీవ్రంగా రక్త స్రావం జరిగింది. వెంకట ప్రసాదు అన్న వెంకటేశ్వర్లుకు కూడా దెబ్బలు తగిలాయి. వెంకట ప్రసాదును గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి, గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. వెంకట ప్రసాదు తండ్రి గురవయ్య, కొమ్మ గోపీ నాగేశ్వరరావు ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం నుంచి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన ముష్కా శంకర్

రెంటచింతల,ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వాహనం నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం గోలి గ్రామ కూడలిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున వివరాల మేరకు.. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా లక్ష్మీపేట మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన ముష్కా శంకర్(55) పదిహేనుళ్లుగా పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ షైన్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెంటచింతలలో కూరగాయలు, ఇతర సరుకు కొనుగోలు చేసి వెళ్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. అతను గుండెపోటుకు గురైనట్లు అంతా భావిస్తున్నారు. మృతుడికి భార్య లత, ఇద్దరు ఆడపిల్లలు న్నారు. లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ నెల 17న పి.రామయ్య అనే వ్యక్తి అక్కడే బైక్ మీద నుంచి పడి మృతి చెందడం గమనార్హం.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు..

కారంపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. బొల్లాపల్లి మండలం రేమిడిచర్లకు చెందిన రామాంజినాయక్ (31), బాణావత్ బాలాజీ నాయక్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వేపకంపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్తున్నారు. పెదకొదమగుండ్లకు చెందిన పల్లెగుంత అంజి ద్విచక్ర వాహనంపై వస్తూ రామాంజినాయక్ బైకును ఢీకొట్టారు. రామాంజినాయక్‌కు తీవ్ర గాయాలు కావడంతో నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. కారంపూడి ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

బెల్లంకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు నరసరావుపేట శేషాద్రి క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్కే మస్తాన్ షరీఫ్ ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. సుమారుగా 150మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బందితో పాటు బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, పీఎస్కే రసూల్, ఎన్ పిచ్చయ్య, వైస్ సర్పంచ్ రజాక్, డీలర్ సుభానీ, అహమ్మద్ తదితరులున్నారు.

నేడు సొసైటీ అధ్యక్షుడిగా శివ ప్రమాణ స్వీకారం


యడ్లపల్లి శివన్నారాయణ

పిడుగురాళ్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వీరాపురం పీఏసీఎస్ అధ్యక్షుడిగా గుత్తికొండ గ్రామానికి చెందిన యడ్లపల్లి శివన్నారాయణ (శివ), సభ్యులుగా గోలి రోశమ్మ, గుర్రం వీరారెడ్డిలు సోమవారం వీరాపురం పీఏసీఎస్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారని పార్టీ మండల కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు తెలిపారు. కూటమి నేతలు, రైతులు హాజరు కావాలని కోరారు.

గురజాల మార్కెట్ యార్డు చైర్మన్‌గా బెల్లంకొండ భారతి

దాచేపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గురజాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా బెల్లంకొండ భారతి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి, కూటమి నేతలు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మాచర్లటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామాటాకీస్ లైన్‌లో ఆదివారం నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. శుభ్రతపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

న్యాయ అవగాహన సదస్సు

మాచర్ల రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల ఎరుకుల కాలనీలో ఆదివారం మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యాన న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న న్యాయ సేవా కమిటి చైర్మన్ శ్రీనివాస్ కళ్యాణ్ బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రరిణామాలను వివరించారు. కాలనీలో బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బుంగా లక్ష్మీ ప్రసన్న, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మృతి బాధాకరం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసరావు మృతి బాధాకరమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బృగుబండ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అన్నదాసు శ్రీనివాసరావు(57) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. శ్రీనివాసరావు మృతదేహాన్ని ఎమ్మెల్యే కన్నా సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరరావు, తులవ జగదీష్, కూటమి నాయకులు ఉన్నారు.

పట్టణంలో దొంగతనం

సత్తెనపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంగం బజారులో ఆదివారం చోరీ జరిగింది. శ్రీనివాస జ్యూవెలరీ యజమాని రామ కృష్ణ గృహంలో ఎవ్వరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తాళాలు పగల గొట్టి 20 గ్రాముల బంగారం, కేజీ వెండి అపహరించుకు వెళ్లారని రామ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రెయిన్ల నిర్మాణమెప్పుడో..?

● సైడు కాలువలు లేక వీధుల్లోనే ప్రవహిస్తున్న వర్షపునీరు
● రాకపోకలకు ఇబ్బందులు


గాంధీ బొమ్మ సెంటర్ వద్ద జలమయమైన అంకారావు వీధి (ఫైల్‌ఫొటో)

కారంపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పాత స్టేట్ బ్యాంకు వరకు మురుగునీరు నిల్వ ఉంటుంది. గాంధీబొమ్మ సెంటర్ వద్ద గల అంకారావు వీధిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు పారుదల జరగడం లేదు. వర్షం పడిదంటే ఈ వీధి వాగును తలపిస్తుంది. ఈ వీధిలోనే బాలబాను విద్యాలయం ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపాలంటే ఇబ్బంది పడుతున్నారు. వర్ష పడిందంటే పాఠశాలకు సెలవు ప్రకటించాల్సి వస్తోంది. అలాగే శాతవాహనుల వీధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతుంది. వర్షం పడిందంటే రోడ్డుపై నీరు పారుతోంది. చీకటి పడిందంటే ఈ బజారున నడవాలంటే బెంబేలెత్తిపోతున్నారు. వర్షం పడితే నిత్యావసర వస్తువులు కొనుగోలుకు సైతం బయటకు వెళ్లే పరిస్థితి. ఇంటికే పరిమితం కావాల్సి వస్తోంది. అలాగే నూతన స్టేట్ బ్యాంక్, ఇందిరాగాంధీ బొమ్మ, పాత స్టేట్ బ్యాంకు వద్ద వీధుల్లో ఇదే పరిస్థితి. గాంధీ బొమ్మ సెంటర్లో రహదారి లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వర్షపునీరు నిలిచిపోతుంది. ప్రజలు, వ్యాపార వర్గాలు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే వారే లేరు. కాగా 2014-2019 టీడీపీ హయాంలో పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా ఉన్న నారా లోకేశ్ కారంపూడి పరిస్థితి తెలుసుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరు చేశారు. పంచాయతీ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి రూ.5 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. నిధులు కూడా మంజూరయ్యాయి. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రతిపాదనలు రద్దు చేశారు. నిధులు వెనక్కు వెళ్లాయి. కారంపూడి వాసులు నిరసనలు తెలిపినా ఫలితం దక్కలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మంజూరు చేయాలని కోరుతున్నారు.

నిలిచిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం

\- గంటా శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో



గత టీడీపీ హయాంలో అధికారులు పరిశీలించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి ప్రతిపాదనలు పంపారు. నిధులు కూడా మంజూరయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు కాకపోవడంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం నిలిచిపోయింది. పంచాయతీ సమావేశంలో తీర్మానం చేసి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, చింతమనేని ప్రభాకర్
● అట్టహాసంగా మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారం


సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

క్రోసూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి పని చేస్తుందని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ అన్నారు. ఆదివారం సాయంత్రం క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా షేక్ జెరీనా జానీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధ్యక్షత వహించగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వం దోపిడీలు, దౌర్జన్యాలు, ఎన్నో అనాగరిక చర్యలను ఎదుర్కొని కూటమి అధికారంలోకి వచ్చిందని, ఆనాడు అరాచ కాలకు గురైన నాయకులకు, కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు లభించటం ఆనందదాయకమన్నారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డును పెదకూరపాడు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో తానే మంజూరు చేయించానని, కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేశామన్నారు. కొత్త పాలక వర్గం రైతుల సేవలే ధ్యేయంగా, వ్యవసాయ అభివృద్ధే పరమావధిగా భావించి పని చేయాలన్నారు. షరీఫ్ మాట్లాడుతూ రాజధాని అమరావతిని నిర్వీర్యం చేయటానికి, తరలించటానికి జగన్ ప్రభుత్వం ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండదండలతో వాటన్నింటినీ ఎదుర్కొని రాజధానిని కాపాడుకున్నామన్నారు. రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జవహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతియుతమైన నియోజకవర్గం పెదకూరపాడు అని, ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాల వారు ఎంతో మంది ఇక్కడ ఉన్నప్పటికీ ఎటువంటి దాడులు గాని, అఘాయిత్యాలు గానీ జరగకపోవటం అభినందనీయమన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్‌గా అమరావతి మండలానికి చెందిన షేక్ జెరీనా జానీ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా అచ్చంపేటకు చెందిన రాయిడి సాంబశివరావుతో పాటు క్రోసూరుకు చెందిన దుద్దుల యోహాన్‌తో సహా పలువురు డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఫోన్ ద్వారా అభినందన సందేశాన్ని సభలో వినిపించారు. ఐదు మండలాల నుంచి వేలాది మంది ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు కంచేటి సాయిబాబు, జిల్లా పరిశీలకుడు నల్లపాటి రాము, ఏపూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్ యార్డు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న షేక్ జెరీనా

మానవ రహిత భారత్ అమిత్ షా లక్ష్యం

● ఏపీసీఎల్‌సీ రాష్ట్ర నాయకుడు చిలుకా చంద్రశేఖర్


'వివా కామ్రేడ్ రవి' పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రజా సంఘాల నేతలు

సత్తెనపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మానవ రహిత భారత్ అమిత్ షా లక్ష్యమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు చిలుకా చంద్రశేఖర్ ఎద్దేవ చేశారు. ఆదివారం పట్టణంలోని పీఎం రెడ్డి గార్డెన్స్‌లో మావోయిస్టు పార్టీ అమరుడు మంజీరపై వచ్చిన 'వివా కామ్రేడ్ రవి' పుస్తకావిష్కరణ సభ జరిగింది. సభకు విరసం కార్యదర్శి రివేరా అధ్యక్షత వహించారు. సభలో పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత భారత్‌గా దేశాన్ని మారుస్తానని కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోస్యం చెపుతున్నారని, వాస్తవానికి మానవ రహిత భారతదేశంగా మారుస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీల వంటి కొద్ది మంది కార్పొరేట్ ప్రయోజనాల కోసం దేశంలో ఖనిజ వనరులను కొల్లగొట్టడానికి అడవులను నరికి వేసి పర్యావరణ సమతుల్యతను దెబ్బ తీస్తున్నారన్నారు. విప్లవ రచయితల సంఘం నాయకుడు పాణి మాట్లాడుతూ విప్లవ రచయిత మంజీర జీవితం త్యాగ పూరితమన్నారు. సభకు ముందుగా ప్రజా కళా మండలి కళాకారులు ఆలపించిన గీతాలు సభికులను ఆకట్టుకున్నాయి. మంజీర జీవన సహచరి తాయమ్మ కరుణ 'వివా కామ్రేడ్ రవి' పుస్తకాన్ని ప్రజా సంఘాల నేతలతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విరసం నేత నల్లూరి రుక్మిణి, కుల నిర్మూలన పోరాట సమితి కార్యదర్శి కే కృష్ణ, పీడీఎం రాష్ట్ర నాయకుడు వై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కోసం మందా కృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం

పెదకూరపాడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ కోసం 30 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేసిన మందా కృష్ణ మాదిగ అడుగు జాడల్లో నడవాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోశాధికారి కంచర్ల జాన్‌బాబు అన్నారు. పెదకూరపాడులో ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు వేమవరపు జీవన్, కఠారి అశోక్, మాచర్ల నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు

● డీసీఎంఎస్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి

నకరికల్లు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం ఎరువులు అందుబాటులో ఉన్నాయని డీసీఎంఎస్ నకరికల్లు బ్రాంచ్ ఇన్‌చార్జ్ ఎం శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. యూరియా రూ.266.50, 20-200-13 బస్తా ఒకటికి రూ.1300, డీఏపీ రూ.1350, 10-26-26 రూ.1720కు ఎరువులు పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. రైతులు సరసమైన ధరలకు ఎరువులను కొనుగోలు చేసి వినియోగించుకోవాలన్నారు.

1600 కొబ్బరి కాయలతో వినాయక ప్రతిమ


కొబ్బరి కాయలతో వినాయక ప్రతిమ

సత్తెనపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డు నాగన్నకుంటలో 1600 కొబ్బరి కాయలతో వినాయక ప్రతిమను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. చీరాలకు చెందిన గోలి శ్రీకాంత్ తన సహాయకులతో కలసి తొమ్మిది రోజులుగా ఈ ప్రతిమను రూపొందించారు. సత్తెనపల్లిలో ఇలాంటి ప్రతిమను ఏర్పాటు చేయటం ఇదే మొదటిసారి. చుట్టు పక్కల ప్రాంత ప్రజలు ప్రతిమను చూసి వెళ్తున్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు


నకరికల్లు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నకరికల్లులో ఉన్న గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఆదివారం భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ పునఃప్రతిష్ఠ జరిగే 16 రోజుల పండుగను పురస్కరించుకొని స్వామిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

చర్చి పనుల పునఃప్రారంభం


చర్చి పనుల పునఃప్రారంభంలో మాట్లాడుతున్న యాగంటి

దుర్గి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్యామరాజపురంలో మధ్యలో నిలిచిపోయిన చర్చి పనులను ఆదివారం టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ 2014-2019 టీడీపీ హయాంలో రూ.2 కోట్లతో శ్యామరాజపురంలో సీసీ రోడ్లు, తాగునీరు, సత్రం, వాటర్ ట్యాంకులు ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేసిందన్నారు. చర్చి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయగా అనివార్య కారణాలతో కొంతమేరకు మాత్రమే పనులు జరిగాయని, కూటమి అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చొరవతో చర్చి నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. టీడీపీ హయాంలో క్రిస్మస్ తోఫా అందించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 275 చర్చిలను నిర్మించారన్నారు. వైసీపీని రాష్ట్రం నుంచి బహిష్కరించి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు పులి హరి, బీజేపీ నేత వెలిదండి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జి యాగంటి నరేష్, సర్పంచ్ తాటి రామారావు, బూత్ ఇన్‌చార్జి బుజ్జి, టీడీపీ నేతలు డాన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేమవరంలో వైభవంగా ముత్యాలమ్మ బోనాలు


ముత్యాలమ్మకి బోనాలు సమర్పించేందుకు తరలి వెళ్తున్న మహిళలు

మాచవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరంలో ఆదివారం గ్రామదేవత ముత్యాలమ్మకి బోనాలు సమర్పించారు. శ్రావణమాసం ముగింపు సందర్భంగా గ్రామంలోని కులాలకు, మతాలకు అతీతంగా అందరూ కలసి మెలసి ముత్యాలమ్మకి బోనాలు సమర్పించారు. గ్రామంలోని పురవీధుల్లో మహిళలు డప్పు వాయిద్యాలతో ర్యాలీగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి సారె, చీర సమర్పించుకుని, మొక్కుబడులు తీర్చుకున్నారు.

దాచేపల్లిలో కృష్ణుని విగ్రహం ఊరేగింపు


శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

దాచేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దాచేపల్లి పుర వీధుల్లో శ్రీకృష్ణుడి పల్లకి సేవ నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ అధ్యక్షులు గడియం పెదరెడ్డి, ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, బొమ్మిరెడ్డి సుధారాణి, హరిదాసు నగేష్ తదితరులు పల్లకి ఊరేగింపులో భక్తులు సహకరించారు.

క్రోసూరుకు భారీగా తరలి వెళ్లిన కూటమి శ్రేణులు


బెల్లంకొండ నుంచి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బయల్దేరిన కూటమి శ్రేణులు

అచ్చంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి క్రోసూరు మార్కెట్ యార్డులో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీలో క్రోసూరు మార్కెట్ యార్డు వైస్ ప్రెసిడెంట్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న రాయిడి సాంబ శివుడు, వెనిగండ్ల కోటయ్య, పాటిబండ్ల బాపిరాజు, పసుపులేటి పాపిరెడ్డి, గాదె ఇన్నారెడ్డి, తుమ్మా విజయరెడ్డి, తుమ్మా కిషోర్‌రెడ్డి, తిరువాయిపాటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారానికి బెల్లంకొండ మండలం నుంచి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్కే మస్తాన్ షరీఫ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన టీడీపీ శ్రేణులకు బెల్లంకొండ హెడ్ క్వార్టర్‌లో వాహనాలను మస్తాన్ షరీఫ్ జెండా ఊపి ప్రారంభించారు. వాహనాల్లో టీడీపీ శ్రేణులు సుమారుగా మూడు వేలకు పైగా తరలివెళ్లారు.

నేటి నుంచి రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నకరికల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రైతు సేవాకేంద్రాల్లో సోమవారం నుంచి యూరియాను పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయ అధికారి కే దేవదాసు తెలిపారు. నకరికల్లు మండలానికి 140 టన్నుల యూరియా వచ్చినప్పటికీ లాగిన్ అవ్వలేదనే కారణంతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన వ్యవసాయ అధికారి సోమవారం యూరియాను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. యూరియా 45 కేజీల బస్తాను రూ.266.50 చొప్పున చెల్లించి రైతు సేవా కేంద్రాల్లో రైతులు పొందవచ్చని తెలిపారు. గుండ్లపల్లి, నరసింగపాడు, చల్లగుండ్ల, చీమలమర్రి, దేచవరం, రూపెనగుంట్ల రైతు సేవాకేంద్రాల్లో రైతులు యూరియాను పొందవచ్చునని తెలిపారు. 260 టన్నులు అవసరమని ప్రభుత్వానికి నివేదించగా మొదటి విడతగా 140 టన్నుల యూరియా మండలానికి వచ్చినట్టు ఏవో దేవదాసు తెలిపారు.

31 లోపు ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తులు

రెంటచింతల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన పరీక్ష నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు ఈనెల 31లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో 1, ఇన్‌చార్జి డిప్యూటీ ఈవో ఏసుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పంపాలని ప్రభుత్వ స్థానిక సంస్థల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. కేంద్రీయ విద్యాలయం, నవోదయ, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుతున్న వారు అర్హులు కాదన్నారు.

శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నడికూడి


నియామక పత్రం అందుకుంటున్న నడికూడి వెంకటేశ్వరరావు

పిడుగురాళ్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కుమ్మర (శాలివాహన) సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పిడుగురాళ్లకు చెందిన నడికూడి వెంకటేశ్వరరావును నియమిస్తూ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు పారెళ్ల బసవేశ్వరరావు నియామకపత్రం అందజేశారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లాలో జరిగిన సమావేశంలో నడికూడి వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రాష్ట్ర నాయకులు బసవేశ్వరరావు, బెజవాడ ఆదిశేషయ్య, కంచర్ల దేవరాజులు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో కుమ్మరులు చాలా వెనుకబడి ఉన్నారన్నారు. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో జిల్లా కమిటీని నియమించారన్నారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇందుర్తి వెంకట శివన్నారాయణ, పిడతల నాగ మల్లేశ్వరరావు, బాపనపల్లి శివరామ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయంలో పూర్ణాహుతి.. లక్ష గాజుల పూజ



దాచేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి గ్రామంలోని శ్రీవీర్లంకమ్మ ఆలయంలో శ్రావణమాసం నెల రోజుల పాటు జరిగిన పూజా కార్యక్రమాలు ముగింపుగా లక్ష గాజుల పూజ, చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. 2 వేల మంది మహిళలు పాల్గొన్నారు.

ఆలయంలో రాసిగా ఏర్పడిన లక్ష గాజులు

మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం

పెదకూరపాడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం...పర్యావరణ పరిరక్షణకు సహకరిద్దాం సహకరిద్దామని జిల్లా ఉత్తమ సేవా అవార్డు గ్రహీత, జతన చైతన్యసమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు అన్నారు. పెదకూరపాడులోని జన చైతన్య సమితి, స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా 75 తాళ్ళూరు మాజీ ఎంపీటీసీ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న జన చైతన్య సమితి నిర్వాహకులు అభినందనీయులన్నారు.

ముమ్మరంగా జల్‌జీవన్ పనులు


రాజుపాలెంలో జరుగుతున్న పనులు

రాజుపాలెం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెంలో జల్ జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికి మంచి నీరు అందించాలి అనే ఉద్దేశంతో చేపట్టిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రజలకు మంచినీరు అందించాలి అనే లక్ష్యంతో ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.72.2 లక్షలు నిధులు కేటాయించింది. దీంతో తొలుత రాజుపాలెంలోని పులిచింతల పునరావాస కేంద్రంలో నివసించే వారికి మంచినీరు అందించేందుకు పనులు చేపట్టి పూర్తి చేసింది. అనంతరం ఇందిరా జయంతికాలనీ వాసులకు ఈ పథకం కింద మంచినీరు అందించేందుకు పనులు ప్రారంభించింది. రెండురోజుల్లో పూర్తవుతాయని చెబుతున్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

ముప్పాళ్ళ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సింగరాజు ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో మండలంలోని మాదలలో సత్తెనపల్లికి చెందిన సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబి రం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్లు సింగరాజు సాయి కృష్ణ, సింగరాజు విద్య, గుంటూరు కిమ్స్ శిఖర ఆస్పత్రి డాక్టర్ ఆకుల శివప్రసాదులు సాధారణ, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసర మైన వారికి ఉచితంగా మందులను అందజేశారు.

చిన్నారి కుటుంబసభ్యులకు పరామర్శ

మండలంలోని మాదల గ్రా మానికి చెందిన బాషా కుమార్తె మగ బిడ్డకు జన్మనిచ్చింది. పసిబిడ్డ గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతుండగా కుటుంబ సభ్యులు దాతల సహాయం అర్థించారు. డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ స్పందించి పసిబిడ్డ ఆపరేషన్‌కు రూ.15వేలు సాయం అందజేశారు. ఆదివారం ఆ కుటుంబసభ్యులను డాక్టర్ సాయికృష్ణ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నెల నెల వైద్యానికి అయ్యే మందుల ఖర్చు తాను అందజేస్తానని కుటుంబసభ్యులకు హామీఇచ్చారు.

చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ

రొంపిచర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడు జడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంగ్లీషు, చేతి రాతపై ఈ శిక్షణ జరిగింది. శిక్షకుడు జున్ను సాహెబ్, బురాన్‌లు మాట్లాడుతూ చేతి రాత వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జిలానీ, షేక్ మహబూబ్ సుభానీ, ఆదెయ్య, పుల్లయ్య, అబ్దుల్ సత్తార్, పూర్వ విద్యార్థుల సంఘం తరుపున బండారుపల్లి నాగేశ్వరరావు, అచ్చుల సుబ్బారావు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పాతపెన్షన్ సాధనకై నేడు విజయవాడలో ధర్నా

నరసరావుపేట టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ సోమవారం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడుకే శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని 2004 సెప్టెంబరు ఒకటి నుంచి నియామకం పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు అన్నారు. అయితే 2003లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఫలితాలను వెల్లడించినప్పటికి ప్రభుత్వమే నియామక ఉత్తర్వులు ఇవ్వడంలో ఆలస్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకొని పాత పెన్షన్‌ను అమలుచేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చిలకలూరిపేటలో మూడు ఇంటరాక్ట్ క్లబ్‌ల ఏర్పాటు

చిలకలూరిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మూడు కొత్త ఇంటరాక్ట్ క్లబ్ ల ఏర్పాటు జరిగింది. వాటిలో ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ జీవీఐటీ స్కూల్, ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ బ్రిలియంట్ స్కూల్, ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ హేలియోస్ స్కూల్ ఉన్నాయని ఇంటరాక్ట్ క్లబ్బుల రీజినల్ ఛైర్మన్ అలంగార్ మోహన్ తెలిపారు. ఈ క్లబ్బుల ద్వారా చిన్ననాటి నుంచే సేవ చేయడం అలవాటు చేసుకోవడంపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు బోనం వెంకటేశ్వరరావు,కార్యదర్శి దోరడ్ల మనోజ్,సింగరావు, రాజు, చెంచు పున్నయ్య, దాసునాయన, రంగా నాయక్ పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రమీలకు సత్కారం

చిలకలూరిపేట, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక 22వ వార్డు మునిసిపల్ కౌన్సిలర్ కూనల ప్రమీల టీడీపీ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా ఆదివారం మునిసిపల్ ఛైర్మన్ షేక్ రఫాని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమెను ఘనంగా సత్కరించారు.

గణపవరంలో టీడీపీ శ్రేణుల ర్యాలీ

నాదెండ్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో టీడీపీ శ్రేణులు ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. గ్రామానికి చెందిన కాట్రు శ్రీనివాసరావును మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా నియమించటంతో ఆయనకు మద్దతుగా ఈ ర్యాలీ నిర్వహించారు. గ్రామం నుంచి ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా చిలకలూరిపేట పట్టణంలోని మార్కెట్ యార్డులో జరుగుతున్న ప్రమాణ స్వీకారానికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో యార్డు డైరెక్టర్ కాట్రు శ్రీనివాసరావు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు పెంటాల శేషయ్య తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి పీడీఎఫ్ సంతాపం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి పీడీఎం సంతాపం తెలియజేసింది. ఆదివారం నరసరావుపేట శివారు ఎస్ఆర్‌కేటీ కాలనీలో వివిధ ప్రజా సంఘాలు సమావేశమై ఘనంగా నివాళులర్పించారు. నివాళి అర్పించిన వారిలో పీడీఎం నాయకుడు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వరరావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ ఫొటోగ్రాఫర్లకు అభినందనలు

వినుకొండ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఫొటోగ్రఫీ వంటి కళలో అంతర్జాతీయంగా రాణిస్తున్న వినుకొండ ఫొటోగ్రాఫర్లకు రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ సభ్యులు అభినందనలు తెలిపారు. 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్‌జీవో హోంలో ఫొటోగ్రాఫర్లకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలోను ఉత్తమ ఫొటోగ్రాఫర్లుగా అవార్డులు సాధించిన వంగపల్లి బ్రహ్మయ్య, కేసనపల్లి సుబ్బారావులతో పాటు సీనియర్ ప్రెస్ ఫొటోగ్రాఫర్ కోకా సుబ్బారావు, వర్తమాన ఫొటోగ్రాఫర్‌లు పాపగంటి వినీల్, గోళ్ల మల్లికార్జునలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఏరువ వెంకటనారాయణ, క్లబ్ కార్యదర్శి బాజీ, కోశాధికారి పి.నవీన్, క్లబ్ జిల్లా ముఖ్యులు ఎ.శ్రీనివాసరావు, సీహెచ్.కోటేశ్వరరావు, ఎం.గిరిబాబు నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు: శ్రీధర్

నరసరావుపేట రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ టెలికాం బీఎస్‌ఎన్‌ఎల్ మెరుగైన సేవలు అందిస్తోందని సంస్థ బిజినెస్ ఏరియా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ సప్పవరపు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 31తేదీతో ఫ్రీడం ప్లాన్ ముగుస్తున్నదన్నారు. ఈ ప్లాన్‌లో పలు ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వినియోగదారులు సిమ్ కార్డు కావలసిన వారు దగ్గరలోని బీఎస్‌ఎన్‌ఎల్‌సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

అధ్వానంగా పీహెచ్‌సీ పరిసరాలు

- కోట్ల విలువైన స్థలం దాతల వితరణ
- సగం స్థలంలో పీహెచ్‌సీ నిర్మాణం
- చిట్టడవిలా పిచ్చిమొక్కలతో ఖాళీ స్థలం
- పీహెచ్‌సీలోకి ప్రవేశిస్తున్న విషసర్పాలు
- భయాందోళనలో సిబ్బంది, రోగులు





శావల్యాపురంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పీహెచ్‌సీ వెనుక ఖాళీస్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు



మందుల గదిలో ఇటీవల కన్పించిన పాము (ఫైల్‌ఫొటో)

శావల్యాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచి జరగాలన్న సంకల్పంతో దాతలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల నిర్మాణాలకు కోట్ల విలువజేసే స్థలాలు సమర్పిస్తుంటే, వాటి పర్యవేక్షణ సక్రమంగా లేక దాతల దాతృతం నిరుపయోగంగా మారుతోంది. మండల కేంద్రమైన శావల్యాపురంలో గుంటూరు -కర్నూలు జాతీయ రహదారి పక్కనున్న సుమారు ఎకరం పొలాన్ని అదే గ్రామానికి చెందిన చేకూరి కోటయ్య విరాళంగా సమర్పించారు. జాతీయరహదారి పక్కన ముందుభాగంలో సుమారు అరెకరం స్థలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి మిగిలిన స్థలాన్ని వెనుకవైపు మెరకకూడా తోలించకుండా ఖాళీగా వదిలేయడంతో పిచ్చిచెట్లు పెరిగి విషసర్పాలకు నివాసంగా మారింది. కోట్లు విలువజేసే స్థలాన్ని ఇలా నిరుపయోగంగా మార్చడంతో మండల ప్రజల నుంచి పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పీహెచ్‌సీలోకి తరచూ విషసర్పాలు ప్రవేశిస్తుండడంతో వైద్యసిబ్బంది, రోగులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళల్లో అవి పీహెచ్‌సీలోకి ప్రవేశించి, ఉదయాన్నే సిబ్బంది విధులకు వచ్చేప్పటికి గదుల్లో కనిపిస్తుండడంతో సిబ్బంది భయంతో వణికిపోతున్నారు. పీహెచ్‌సీలో చాలా సామగ్రి ఉండడంతో వాటి వెనుక విషసర్పాలు చేరుతుండటంతో సిబ్బంది భయపడిపోతున్నారు. ఇటీవల ఓవిషసర్పం కంప్యూటర్ గదిలోకి ప్రవేశించింది. సిబ్బంది దానిని పట్టించేందుకు యత్నించే లోపల అది కనిపించలేదు. పీహెచ్‌సీలో 24గంటలు వైద్యసేవలు అందిస్తుంటారు. విషసర్పాలతో ఎప్పుడు ఎవరికి ప్రమాదం జరుగుతుందోనన్న భయం సిబ్బంది, రోగుల్లో నెలకొంది. గతంలో పలుమార్లు సిబ్బంది సొంత ఖర్చులతో ఖాళీస్థలంలో పిచ్చిమొక్కలు పీకించారు. కానీ లోతట్టు స్థలం కావడంతో వర్షం కురిసిన ప్రతిసారీ పిచ్చిమొక్కలు విపరీతంగా పెరుగుతుండడంతో ఏంచేయలేక వదిలేశారు. పీహెచ్‌సీలో మందుల నిల్వలకు, ఓపీలకు అదనపు గదులు లేక కష్టతరంగా మారింది. వైద్యసేవల కోసం వచ్చిన రోగులు కూడా ఇరుకైన గదుల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఖాళీస్థలాన్ని బాగుచేయించి దానిలో అదనపు గదుల నిర్మాణం చేయించి రోగులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కోలాహలంగా ప్రమాణ సీకారోత్సవం

- కూటమి పార్టీ నాయకుల భారీ ర్యాలీ



మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, యార్డు ఛైర్మన్ కరీముల్లా తదితరులు

చిలకలూరిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు కొత్త కమిటీ సభ్యుల పదవీ స్వీకార మహోత్సవం ఆదివారం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా కూటమి పార్టీల శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గుర్రాల చావిడి నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన సెంటర్ల నుంచి మార్కెట్ యార్డు వరకు సాగింది. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, యార్డు ఛైర్మన్ షేక్ కరిముల్లా, వైస్ ఛైర్మన్ పిల్లి కోటి, ఇతర సభ్యులు ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలనుంచి రైతులు తమ ట్రాక్టర్లతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. కొందరు గుర్రాలెక్కి ర్యాలీలో ముందుకు సాగారు. దారి పొడవునా బాణసంచా, గజమాలలతో కూటమి శ్రేణులు స్వాగతం పలికారు. మహిళలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ, సభ నేపథ్యంలో భారీఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పదవీ స్వీకారోత్సవ సభలో జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం ప్రజలకు, రాష్ట్రానికి తిరుగులేని రక్షణ కవచం అన్నారు. ఎన్ని ఆర్థిక సమస్యలున్నా ఎన్నికల హామీలను క్రమం తప్పకుండా అమలు చేస్తున్నట్టు చెప్పారు. సూపర్ సిక్స్ గ్రాండ్ సక్సెస్ అన్నారు. ఫేక్ ప్రచారాలపై జాగ్రత్తగా ఉండాలని, వాటిని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. ప్రజలు మెచ్చేలా పనిచేయాలని, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. చిలకలూరిపేట యార్డు ఛైర్మన్‌గా నియమితులైన షేక్ కరిముల్లా, వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావులకు, ఇతర సభ్యులకు వారు అభినందనలు తెలిపారు. సమర్థులైన వారిని యార్డు కమిటీ సభ్యులుగా ఎంపిక చేశామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి చెప్పారు. కూటమి శ్రేణులు ఐక్యంగా మెలగి ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆయన కోరారు. వార్డులలో రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని, రైతులను చైతన్య పరచాలని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సూచించారు.

కొండ్రగుంట కుటుంబానికి ప్రత్తిపాటి పరామర్శ



కొండ్రగుంట కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలంలోని వేలూరు గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు కొండ్రగుంట కోటేశ్వరరావు సంస్మరణ కార్యక్రమానికి ఆదివారం పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. ఆయన కుమారుడు, గుంటూరు ఎల్వీఆర్ క్లబ్ జాయింట్ సెక్రటరీ కొండ్రగుంట శ్రీనివాసరావును, కుటుంబ సభ్యులను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, స్థానిక సీఆర్ క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్, కుర్రా అప్పారావు, ముద్దన నాగేశ్వరరావు, గోనుగుంట్ల శివ తదితరులు పరామర్శించారు.

సాయి పథంలో నిత్య సాధన చేయాలి

- సత్యసాయి ఆధ్యాత్మిక సేవా సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ భాస్కర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సాయి పథంలో నిత్య సాధన చేయాలని, భజన, ప్రార్థన, కోరికలపై అదుపులో ఉంచుకోవాలని సత్యసాయి ఆధ్యాత్మిక సేవ సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ కస్తూరి భాస్కర్ అన్నారు. ఆదివారం సత్యసాయి శతజయంతి వేడుకలలో భాగంగా నరసరావుపేటలోని సత్యసాయి మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాధన క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కస్తూరి భాస్కర్ మాట్లాడుతూ నవసూత్ర నియమావళిని వివరించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా అధ్యక్షుడు, జిల్లా కో ఆర్డినేటర్‌లు, సమితి కో ఆర్డినేటర్లు, భక్తులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న రామారావు, పాల్గొన్న జేవీవీ సభ్యులు

విజ్ఞాన దృక్పథంతో ముందుకు నడవాలి

- జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు

వినుకొండ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విజ్ఞాన దృక్పథంతో ముందుకు నడవాలని జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు అన్నారు. పల్నాడు జిల్లా జనవిజ్ఞాన వేదిక మహాసభ ఆదివారం వినుకొండ సీపీఎం కార్యాలయంలో జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకావిష్కరణను డాక్టర్ ఎల్ఎన్‌రావు, జేవీవీ పతాకావిష్కరణను డి.వెంకట్రావు చేశారు. ఈ సందర్భంగా జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం విద్యార్థులలో పెంపొందించాలన్నారు. మూఢ నమ్మకాలు నిర్మూలించాలని, జ్యోతిష్యం, వాస్తు, గ్రహబలాలు, చేతి రాతలు, పునర్జన్మలు, బల్లి శాస్త్రాలు, పుట్టుమచ్చ శాస్త్రాలు అశాస్త్రీయ మని ఎవరూ నమ్మవద్దన్నారు. సైన్స్ అనే టెక్నాలజీని నిత్యజీవితంలో ఉపయోగించుకొని ముందుకు నడవాలని వక్తలు దార్ల బుజ్జిబాబు, కే.శ్రీనివాసరెడ్డి, కే.నారాయణ, జి.కమలారామ్, ఎస్.చలపతిరావు, జేవీకే ప్రసాద్ తెలియజేశారు. ఈ మహాసభలో పల్నాడు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కేవీ రమణ, ప్రధాన కార్యదర్శిగా చలపతిరావు, కోశాధికారిగా డి.వెంకట్రావు, సహకార్యదర్శిగా జి.కమలారామ్, సలహాదారుడిగా కే.ఆదినారాయణ, జిల్లా సమతా విభాగం కన్వీనర్‌గా కే.రేణుక, జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఏ నాగేశ్వరరావు కార్యవర్గ సభ్యుడిగా బి.త్రివిక్రమ్, జె.శ్రీనివాసరావు, బి.రవికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు తెలియజేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా జన విజ్ఞాన వేదిక సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార సంఘ గోదాములో అధికారుల తనిఖీ



సహకార సంఘ గోదామును పరిశీలిస్తున్న అధికారులు

నాదెండ్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి సంబంధించి ఎరువుల గోదామును రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ కే చంద్రశేఖర్, ఏవో ఆదినారాయణ, స్థానిక మండల వ్యవసాయ అధికారిణి పీ శ్రీలతతో కలసి ఈ గోదామును తనిఖీచేశారు. ఈ సందర్భంగా నిల్వలతో పాటు రికార్డులను పరిశీలించారు. వారికి సొసైటీ అధ్యక్షుడు పెంటాల శేషయ్య, సీఈవో లక్ష్మయ్యలు వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల దుకాణదారులు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

280మందికి మందులు పంపిణీ

యడ్లపాడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో యడ్లపాడు సామాజిక సాంస్కృతిక వేదిక బాసట ఆధ్వర్యంలో బీపీ, షుగర్ వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ గుంటుపల్లి దివ్యతేజ, డాక్టర్ భవ్యతేజలు పాల్గొని వైద్య సేవలు అందించారు. శిబిరానికి హాజరైన 280మందికి రెండు నెలలకు సరిపడ మందులను అందించారు. కార్యక్రమాలను బాసట సభ్యులు, వలంటీర్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మానుకొండ రామారావు వలంటీర్లకు టిఫిన్, భోజన సదుపాయాలను కల్పించారు.

నేడు ఆధునిక చేపల మార్కెట్‌కు శంకుస్థాపన

చిలకలూరిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 21వ వార్డు పరిధిలో గడియార స్తంభం సమీపంలో రూ.1.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక చేపల మార్కెట్‌కు సోమవారం ఉదయం శంకుస్థాపన జరుగుతుందని మునిసిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, కమీషనర్ పి.శ్రీహరిబాబు ఆదివారం తెలిపారు. ముఖ్య అతిథిలుగా నరసరావుపేట ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పాల్గొంటారన్నారు.

గ్రామంలో అడ్డుగా ఉన్నారని మా నేతలపై దాడి

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం టి.అన్నారం గ్రామంలో శనివారం రాత్రి వైఎస్సార్సీపీ కార్యకర్త, బూత్ ఏజెంట్ వెంకటప్రసాద్‌పై కత్తులతో టీడీపీ నేతలు దాడి చేయటం దుర్మార్గమన్నారు. 2024 ఎన్నికల్లో బూత్ ఏజెంట్‌గా ఉండి రిగ్గింగ్‌ను అడ్డుకోవడంలో ప్రసాద్ కీలకపాత్ర పోషించాడన్నారు. దీని కారణంగా పలుమార్లు ఆయనపై దాడి పన్నాగాలు విఫలమైనప్పటికీ, ఈసారి టీడీపీ నేత రామయోగి, రాంబాబు, గోపి, నాగేశ్వరరావులు కత్తులతో దాడి చేశారని ఆరోపించారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో వైద్య శిబిరం



వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న కళాశాల ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం గుంటూరు కోనాక్ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది ప్రత్యేకంగా శిబిరానికి హాజరై పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, ఛైర్మన్ షేక్ మీరావలి, ఎండీ డాక్టర్ ఎస్కే మస్తాన్ షరీఫ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్కే కరీం మొహిద్దీన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్కే నజీమా పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు బొల్లాకు తగదు: జీవీ



బొల్లా ఆరోపణలపై చిత్రాలను చూపుతూ ప్రశ్నిస్తున్న చీఫ్ విప్ జీవీ

వినుకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రెండు కుంటుబాల మధ్య జరిగిన ఘర్షణలకు పార్టీ రంగు పులిమి తప్పుడు ఆరోపణలు చేయటం మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తగదని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హితవు పలికారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ నూజెండ్ల మండలం టి.అన్నారంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణను తెలుగుదేశం పార్టీకి ఆపాదించడం సరికాదన్నారు. కత్తితో పొడిచింది, గాయపడింది వైసీపీ వాళ్లయితే టీడీపీకి ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఇద్దరు కూడా బొల్లా బ్రహ్మనాయుడు ప్రోత్సహించి, పోషించిన వారే అన్నారు. ప్రసాద్‌ను పొడిచిన గోపి వైసీపీ కాదా అని ఆ పార్టీ కండువాతో ఉన్న ఫొటోలను చూపిస్తూ ప్రశ్నించారు. జగన్ ఊరేగింపుల్లోనూ గోపి పాల్గొన్న వివరాలను మీడియాకు విడుదల చేశారు. తెలుగుదేశం పార్టీకి ఈ కత్తి పోట్లను ఎలా అంటగడతారని మండిపడ్డారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎక్కడో అన్నారంలో జరిగిన సంఘటనకు జీవీకి, మంత్రి లోకేశ్‌కు, చంద్రబాబుకు ఏమి సంబంధం అని ప్రశ్నించారు. బొల్లా వ్యక్తిగత దూషణలకు దిగడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్, కొమ్మా శ్రీను, బీసీ నాయకులు గోవిందరాజులు, దాసయ్య , బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హ్యాండ్స్ ఆన్ లైవ్ సర్జికల్ వర్క్‌షాప్



శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారితో ఆర్గనైజింగ్ డైరెక్టర్ డాక్టర్ జగన్‌మోహనరెడ్డి, ఇతర వైద్యులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొండవీడు ఈఎన్‌టీ ఆసుపత్రిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న హ్యాండ్స్ ఆన్ లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ ఆదివారం విజయవంతంగా ముగిసింది. మూడు రోజులు వర్క్‌షాప్‌లో మొత్తం 39 శస్త్ర చికిత్సలు చేశారు. ముక్కుకు సంబంధించి 19, చెవికి సంబంధించి 10, గొంతుకు సంబంధించి 10 చేశారు. కార్యక్రమంలో గుంటూరు జీజీహెచ్ నుంచి ఈఎన్‌టీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కేఎల్ ప్రసాద్‌రావు, పొఫెసర్ డాక్టర్ వై సుబ్బరాయుడు, సీనియర్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ శేఖర్‌రెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చెందిన ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ సుధీర్ చంద్ర పాల్గొన్నారు. ఏపీఎంసీ నుంచి అబ్జర్వర్‌గా డాక్టర్ కే శ్రీనివాసరెడ్డి, క్యాంప్ ఆర్గనైజింగ్ డైరెక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, క్యాంపు కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీవల్లి, కాకినాడు డాక్టర్ ఎం.శ్రీధర్, డాక్టర్ విష్ణురాజు సహకారం అందించారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న పొన్నపాటి ఈశ్వరెడ్డి, బ్రహ్మకుమారీస్ నరసరావుపేట శాఖ ఇన్‌చార్జి బీకే అరుణ తదితరులు

మెగా రక్తదాన శిబిరం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం నరసరావుపేట శాఖ బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించారు. రాజయోగిని ప్రకాశమణి దాది 18వ వర్ధంతి పుణ్యస్మృతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 24 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆగస్టు 22 నుంచి 25 వరకు దేశవ్యాప్తంగా 1500 సేవా కేంద్రాలలో రక్తదాన శిబిరాలు నిర్వహించి ఒక లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించడం లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టారని పట్టణ ఇన్‌చార్జి బీకే అరుణ తెలిపారు. కార్యక్రమంలో ఈశ్వరరెడ్డి, ఎంఏఎం కాలేజీ ఛైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి గుప్తా, కోశాధికారి డాక్టర్ రామ్ ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




శిక్షణలో పాల్గొన్న క్రీడాకారిణిలు

ఉత్సాహంగా బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ

వినుకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రోడ్డులోని నిర్మల స్కూల్లో గుంటూరు బాల్ బ్యాడ్మింటన్ మహిళల జట్టు, సబ్ జూనియర్, సీనియర్ జట్లకు జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ వై.శ్రీనివాసరావు సందర్శించారు. ఈ శిక్షణ క్యాంపు ఈ నెల 28 వరకు జరుగుతుందన్నారు. అనంతరం ఈ నెల 29 నుంచి 31 వరకు ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే 11వ రాష్ట్ర స్థాయి పోటీలలో క్రీడాకారిణిలు పాల్గొంటారని అన్నారు. క్రీడాకారులకు వినుకొండ బీవీరెడ్డి ఎలక్ట్రానిక్ బీవీ సురేష్, సెవెన్ హిల్స్ బీఈడీ కాలేజీ కరస్పాండెంట్ దళారి అనిల్ కుమార్ శిక్షణలో ఉన్న క్రీడాకారిణిలకు భోజన నిత్యావసరాలకు సాయం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ జాయింట్ సెక్రెటరీ జోనా నాయక్, సుపీరియర్ సిస్టర్ సిసిలి, ప్రిన్సిపాల్ సిస్టర్ రాణి, ఏడీ ఆంజనేయులు, పీఈటీ శ్రీనివాసరావు, సంధ్య, ఉపాధ్యాయులు జిలాని పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌కు సత్కారం



బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌ను సత్కరిస్తున్న కార్యవర్గం

వినుకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నూతనంగా నియమితులైన బుచ్చి రాంప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గం ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ఆఫీసులో రాష్ట్ర అధ్యక్షుడు ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు బలరామ కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గం బుచ్చి రాంప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్, కోశాధికారి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర న్యాయ విభాగం కన్వీనర్ కె.నారాయణరావు, వినుకొండ బ్రాహ్మణ సంఘం తిరుపతి, కడప, నెల్లూరు, చిలకలూరిపేట, కృష్ణా జిల్లాలో బ్రాహ్మణ సంఘాల రాష్ట్ర ప్రతినిధులు మాధవరావు, రఘు మాస్టర్, దేవులపల్లి చంద్రశేఖర్, ఆర్.సాయిరాం తదితరులు నూతన ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.